SRI SADGURU MANANAMU

(Telugu)

By

Vaachaspathy



న గురో రధికం తత్త్వం న గురో రధికం తపః |

న గురో రధికం జ్ఞానం తస్మై శ్రీ గురవే నమః ||

Rs.70

శ్రీ సద్గురు మననము



వాచస్పతి

FORE -BLURB

ॐ

|| ఓం శ్రీ సద్గురు సాయినాథాయ నమః ||

|| ఓం శ్రీ దత్తాయ గురవే నమః ||

|| ఓం పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజాయ నమః ||

ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి

శ్రీ సద్గురు మననము

(లఘు టీకా సహితము)

రచన : **వాచస్పతి**

: ప్రచురణ :

శ్రీ సాయి రాఘవేంద్ర వాస్తు జ్యోతిషాలయము

హైదరాబాద్

2017

 [వెల : రు. 70/

<u>SRI SADGURU MANANAMU</u> (Telugu) An Anthology of Poems in Praise of The Spiritual Master

By **VAACHASPATHY**

First Published (Present Edition) : January 2017 By Sri Sai Raghavendra Vaastu Jyothishalayam
HYDERABAD.

PRICE : Rs. 70.

అంకితము



రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ

శ్రీ సచ్చిదానంద సమర్థ సద్గురు సాయినాథ మహారాజ

పావన పాద పద్మములకు

|| ఓం శ్రీ సద్గురు సాయినాథాయ నమః ||

|| ఓం శ్రీ దత్తాయ గురవే నమః ||

|| ఓం పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజాయ నమః ||

శ్రీ సద్గురు మననము

ధ్యానము

అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరమ్ |

తత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవే నమః ||

మంగళాచరణములు

మహాగణపతికి - సింధురాననునకు[1]
శితికంఠున కాదిమ - సిద్ధ గురువర్యునకు
వేదోపదేశకుఁడు - విశాఖదేవునకు
గీతాగాయిత శ్రీ = కృష్ణ పరమాత్మకు

[1] ఛందస్సు :– కుఱు కాకతీయము ; లక్షణము :– ప్రతి పాదమునందును ఒక్కొక్కటి 5 మాత్రలు గల 4 గణములు. అయినను పాదమునందలి మొత్తము మాత్రలు 18 – 22 వఱకు ఉండవచ్చును. మూఁడవ గణాద్యక్షరము యతి. కానీ యతిప్రాసలు మఱియు సంధి సమాసములు వైకల్పికములు. ఇక్కడిది పద్యమునకు 8 పాదములు గల అష్టపదీ రీతి.

దయాక్షమావార్ధి - దక్షిణామూర్తికిఁ
బ్రాణులకు స్ఫురణమౌ - ప్రకృతిరూపవాణికి
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 1

మధుచ్ఛందో ముఖ్య - మహామంత్రదర్శులకు
అత్రి కనసూయకు - అట్టి సప్త ఋషులకు
సనక సనందనులకు - సనత్కుమారునకు
బోధిసత్త్వ మైత్రే - యాది మహాగురులకు
వరగోత్ర ఋషులకు - వంశ మూలపురుషులకు
ఒడిలోని బుడుతలను - నడిపిన గృహ మహిషులకు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 2

సిద్ధ సమ్రాట్టైన శ్రీ - షిరిడి సాయికి
అక్కలకోట స్వామికి - అభయ ప్రదాయికి
మహా మహితాత్ముఁడు - మాణిక్య ప్రభునకు
సాటి లేని నృసింహ - సరస్వతీ విభునకుఁ
బావన పిఠాపుర శ్రీ - పాదవల్లభునకు
ఇత్యాది యుగదత్త - సత్యావతారములకు

నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 3

సారాద్వైతి శ్రీ - శంకరాచార్యులకు
మహా మనీషి రా - మానుజాచార్యులకు
ద్వైతమత దీప్తి మ - ధ్వాచార్య వర్యులకు
సిద్ధజన కేసరి - శ్రీ రాఘవేంద్రార్యులకు
అచల తత్త్వ వేదాం - తావధూత వేమనకు
పోతులూరి శ్రీ వీర - బ్రహ్మేంద్ర స్వాములకు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 4

శ్రీ శాక్య గౌతమ - సిద్ధార్థ బుద్ధునకు
క్షమావతారునకు - సదా మహావీరునకు
కృపామయుఁడు శ్రీరామ - కృష్ణ పరమహంసకు
నారాయణాంశుఁడౌ - నరేంద్రనాథునకు
దక్షిణాగ్ని యని చెప్పఁ - దగు రమణ మహర్షికి
రహస్యావధూత ఎక్కి - రాల భరద్వాజకు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 5

ధన్యుఁడు శ్రీ తులసీ - దాస గోస్వామికిఁ
గాకుత్స్థ సేవియౌ - కబీరు మహాకవికిఁ
బరమ భాగవతుఁడౌ - గురునానక మునికి
జందవెస్తా బోధి - జరదుష్ట్ర సంయమికి
అబ్రహామున కితర - హెబ్రీ ప్రవక్తలకు
యహోవా దాసునకు – అభిషిక్త యేసునకు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 6

మహాత్ముఁడు గుంటూరి - మస్తాన్ వలిగారికి
నెల్లూరి హజరత్తు - హుస్సేను గారికి
కర్నూల్ మహనీయుఁడు - ఖాన్ సాహెబునకు
బందరు మహాశయుఁడు - బాబా ఫరీదునకు
నాగపుర వాస్తవ్యుఁడు - తాజుద్దీనునకు
సూటి త్రోవ సూపిన - సూఫీ లితరులకు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 7

ఎందఱో సద్గురువులు - అందఱికి వందనములు
ఎన్నియో మార్గములు - అన్నిటికి బ్రణామములు

ఎందఱో దేవతలు - అందఱికి దీపములు
ఎన్నియో వ్రాయికలు - అన్నిటికి ధూపములు
ఒకటియే శరీరము - ఒకటియే ప్రయాణము
ఒకటియే శకటము - ఒకఱిదే ప్రచోదనము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 8

ఏ మతస్థులైనను - ఏ కులస్థులైనను
ఏ వర్ణమైనను - ఏ దేశమైనను
అమ్మగార్లైనను - అయ్యవార్లైనను
ఏ పేరైనను గురులు - ఎల్లఱొకే బ్రహ్మము
వేఱు పేళ్ళ జలనిధులు - వెరసి ఒకే సముద్రము
వేర్వేఱు నాడ్మలై - వెలసె నొకే భూతలము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 9

వటవృక్ష సన్నిభులు - వసుధ సద్గురు విభులు
బోధపడదు జాడ – బోదె-ఊడల తేడ
ఆమిషము ప్రాణులన్ని – ఆత్మయే జీవులన్ని
అగాధమెట మయాన - ఆత్మదర్శిత వినా?

తన్ను వెల్లడించుకోఁ - దెన్ను లే దీశునకుఁ
గుమార నిర్విశేషము - గురువేషము మినహా
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 10

శ్రీ సద్గురు వర్ణనాత్మక స్తుతి

శరణుల జన్మ రుజా - జరా మరణములపై
దొరతనము నెరపఁగల – ద్రుహిణుఁడే సద్గురువు
విహ్వాలురను బ్రోవఁగా - విసంఖ్యావతారముల
విశ్వమున వెలయునట్టి - విష్ణువే సద్గురువు
హాలాహలము మ్రింగి - అమృతము నొసంగు
మృత్యుంజయుని మర్త్య - మూర్తియే సద్గురువు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 11

ప్రకృతికి లేదు మతము - స్వకృత తనులు వినా
పురుషునకు లేవు తనులు - పుణ్యము లాత్మలు వినా
సద్గురుల కళ్ళ కను - స్వారమీ రెండుఁ గన
నిఖిల జీవుల యెడ - నిష్కామ ప్రేమ వినా

చరాచర వ్యాపులు - మానవతారూపులు
సహృదయ మేరువులు - సమర్థ సద్గురువులు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 12

గురువులైనందుకే - వరణీయులు నేతలు
గురుత వహించుటనే - గొప్ప మాతాపితలు
కోకిలలకు గొంతులు - గోవత్సపు గంతులు
సేకూర్చుఁ బుట్టుచునే - స్నేహమున బ్రకృతియే
గురుతత్త్వ పూర్ణము - చరాచర సృజనము
గురువు గాని ప్రకృతిమాయి - గ్రుడ్డి గులకఱాయి
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 13

సాంబరులు దిగంబరులు - క్షౌమ పీతాంబరులు
సుందరులు తుందిలులు - చూడ భయంకరులు
అలంకృతులు వికృతులు - అతిప్రాకృతులు
శుచులు మహాశుచులు - సుగంధాభిరుచులు
నాగరులు బర్బరులు - నానాడంబరులు
నర సామాన్యమునకుఁ - గొఱుకుడు పడరు గురులు

నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 14

కర్మఠులు నిర్మఠులు - కమఠులు సుహఠులు
గృహస్థులు వనస్థులు - ఘోర మౌనస్థులు
బ్రహ్మచర్య కాయులు - భార్యాసహాయులు
దేవాలయ చారులు - దేశాధికారులు
అతిమానుష శక్తులు - అందఱి వంటి భక్తులు
గురువుల పైపై తీరు - గుఱుతు పట్టంగలేరు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 15

దృశ్యులు అదృశ్యులు - నిద్రానిరీక్ష్యులు
శఫరీ మాంసాదులు - శాకవాయు ఖాదులు
జడులు ముండులు దీర్ఘ - జటు లిలాపర్యటులు
అధ్యాత్మభాషులు - అక్షర విన్యాసులు
సేవాసాధకులు - జీవ సమాధికులు
శత సహస్ర విధములు - సద్గురువుల పథములు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 16

మితిలేని జ్ఞానమును – మతికందని శక్తియు
శక్తి నధఃకరించు - సదసద్వివేకమును
గలిగియుఁ బ్రేష్యులుగాఁ - గాక స్వశిష్యులను
దనతోడి సములుగాఁ - దనయ సత్తములుగా
మన్నించు సద్గురువు మహిలోఁ గల్పతరువు
భగవంతుఁడయ్యును - మొగమోటమి కిరవు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 17

జ్ఞానరాశిగాఁ దాను - గాంతులీనుచున్నను
నిసుగుఁ బోలిన పరమ - నిర్మలుడు సద్గురువు
త్రికాలజ్ఞానియై - ప్రకాశించుచున్నను
భవంతములో బ్రదుకు – యువకుఁడే సద్గురువు
జన్మ జరా సమాధి - శాలియై యున్నను
సర్వేశ్వరునంతటి – సనాతనుఁడు సద్గురువు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 18

ఇలవేల్పు రూపమై – కలలోనఁ దోఁచునది
ఇష్టదైవాకృతిని - హితమాచరించునది

ప్రియబాంధవాత్మయై – దయఁ బల్కరించునది
సాధు శరణులుగా - సలహాల నిచ్చునది
ఖచ్చితము సద్గురువె - కాదు తదన్యుండు
నచ్చిక యెచ్చటఁ బండు - నదియె తానై యుండు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 19

ధర్మాధర్మములకుఁ - దానే ప్రమాణము
ధ్యాన ధారణములకుఁ - దానే పరాయణము
స్వకర్మాచరణకు - సన్మార్గ దర్శనము
తాత్త్వికి సత్యములకుఁ - దానే నిదర్శనము
మతగ్రంథంబులకు - మానవతా స్పర్శము
తర తరంబులకును - దానే ఆదర్శము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 20

ఇలవేల్పులారాధన - యిష్టదైవార్చన
తుల లేని గురు నడుగు - దోయికైన సాధన
సద్గురూపదేశము - సంజీవని సుధయు
సుదర్శన చక్రమును - సువర్ణటంక నిధియు

గురూపచరణాను - కూలము నరవర్త్మము
గురువు లేని జన్మము కొఱగాని కర్మము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 21

తన కన్న నెఱుఁగఁదగు - తత్త్వశాస్త్రము లేదు
తన సేవపై మహా - తపశ్చర్యయు లేదు
తన నెఱుఁగుటకు మించి - "తత్త్వమసి"యును లేదు
తన పాదముల కన్న - ఘనతీర్థమును లేదు
తన వాక్కు కన్న సనా - తనమైన ఋక్కు లేదు
సద్గురు సన్నిధి మీఁద - సాయుజ్యమును లేదు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 22

పురాణ పురుషులును - బరిపూర్ణులు గారే !
కొఱఁత లేని పూర్ణుఁడు - సద్గురువుగారే
వేదకాలపు ఋషులు – వేలాది మంది గలిసి
మేళనమై రొకచో - మేటి గురువుగా వెలసి
మూడు మూర్తుల కతఁడే - మూలమూర్తిభావము
సాంగవేదము తులసి - లింగము సాలగ్రావము

నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 23

క్షణకాలము పాటన్న - సద్గురువు కూర్చున్న
స్థలము శక్తికేంద్రము - సర్వథా పవిత్రము
అపుడో యిపుడో యగు - నది మహాక్షేత్రము
అధునాతన నగరము - అధికార చ్ఛత్రము
లక్ష్మీనివాసము - లక్షలకు విలాసము
నిత్య కల్యాణము – పచ్చ తోరణము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 24

సద్గురు సన్నిధినే - సంపన్నము వివాహము
సద్గురు పూజతోనె - సమకూడును స్వగృహము
సద్గురు దీవనతో - సవ్యము తీర్థయాత్ర
సద్గురు స్మరణతో - శక్తిమంతము మాత్ర
సద్గురు కృపతోనే - సఫలము లపరకర్మలు
సద్గురు నిష్ఠులైన - సకల కర్ములు శర్మలు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 25

స్మరియించినందుకే – సద్గురుఁడు తనివోవు
గుర్వనుగ్రహంబున - సర్వదోషము వోవు
స్వాదనీయంబగును - సంసార విషఫలము
భీషణమైన పర - భాషలు సరాళము
పాషాణ పాకపుఁ - బటు గ్రంథరాశులే
పఠనీయములగును - బటిక బెల్లపు దినుసులై
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 26

వేల్పుల దీవనకై – వేచి యుందురు జనులు
వారొజ్జ దీవనకుఁ - గాఁచెద రెదురుతెన్నులు
పుణ్యమునకై నదీ - పుష్కరముల గ్రుంకెదరు
ఆ తల్లులు సద్గురుని - అంఘ్రులకు మ్రొక్కెదరు
శాస్త్రసమ్మతి అనుచు - సంకటపడుచుందురు
అన్ని శాస్త్రములకు గురుఁ - డాద్యుండని మఱతురు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 27

అష్ట విభూతు లాయన – కనుఁగు వంశకరులు
నవ నిధులాయనకు - నమ్మిన కింకరులు

పంచభూతము లాయన - కించు వశంవదులు
పది దిక్కు లాయనకుఁ - బ్రతివేశ వసతులు
తొమ్మిది గ్రహములును - దోలుబొమ్మలు తనకు
సకల లోకము దీర్ఘ - స్వప్నము సద్గురునకు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 28

తనువును లక్షింపఁడు - ధనమును గాంక్షింపఁడు
ఆస్తుల రక్షింపఁడు - అపసము భక్షింపఁడు
తులువల శిక్షింపఁడు – దోషము లీక్షింపఁడు
అలుసుగ భాషింపఁడు - అనిష్టము ద్వేషింపఁడు
అధికుల భూషింపఁడు - అరులను దూషింపఁడు
నిరంజనుఁడయ్యు గురుఁడు - నిఖిల మనోరంజనుఁడు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 29

ఏదియు మఱచిపోఁడు - ఎవఱిని వీడి వెడలఁడు
ఋణములుంచుకొనఁడు - తృణమును ఆశింపఁడు
అబద్ధమును సహింపఁడు - అతిభాషణమోర్వఁడు
అవినయము క్షమింపఁడు - అకృతజ్ఞుల మెచ్చఁడు

అన్నది అనుకొన్నది - అక్షరాల వినకపోఁడు
మంచి గురుఁడు సర్వదా - మంచి నరుఁడౌను గదా!
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 30

చెప్పఁడు తాను జెప్పఁ - జాలినది శిష్యులకుఁ
జెప్పును వారు సేయఁ - జాలినదే యెంతకు
వారి దుష్కర్మఁ దన - వలనైనంత వఱకు
వారించుచు నందుండి - నేఱించును మేల్పలుకు
ప్రబోధమునకు దీర్ఘ - ప్రసంగములు సేయక
అబాధానుభవముల - హత్తించును గాక !
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 31

అనేక వికారముల - కేకైక వైద్యుఁడు
భూత ప్రేత పిశాచ - భీతావహ కరుఁడు
సకల లోకముల నడుమ - సందేశ హారకుఁడు
వేఱు యుగముల మధ్య - వారధి సద్గురుఁడు
అఖిల భాషావిదుఁడు - సకల కళావల్లభుఁడు
శాస్త్రముల కందని - చాతుర్య దుర్లభుఁడు

నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 32

ఆచార రహితుఁడే - ఆచారి మన కొఱకు
లోకమున కతీతుఁడే – లౌకికుఁడు మన పొంటె
అనఘుఁడే అస్వస్థుఁ - డగును మన పాపమున
మత విరహితుండయ్యు - మతములను స్థాపించు
సురల కర్థము కాని - నరజీవితపు బరువు
నరయఁజాలిన వేలు- పాతఁడే సద్గురువు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 33

వేలాది మందికై - వ్యవసాయము సేయును
అందిన పంటంతయు – అందఱికిఁ బంచును
తానే గానుగాడి - తైలంబును దీయును
దీనితో నందఱికి - దీపము వెలిఁగించును
వారి వారి జీర్ణత - వైనము ననుసరించి
వడ్డనలు వివిధములు - వచ్చు గురువు నుంచి
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 34

కలకాలముఁ గావఁడు - కాంచరి సంతానము
నెల్ల సీమల మంది - నేలలేదు దొరతనము
స్వజనంబులు సర్వదా - సముఖంబున నుండరు
తాము దలఁచువారు - తమను దలఁచుకోరు
తమను దలఁచిన కొలఁది - కనులకు ఱెప్పలట్లు
భక్తుల దరి నుండెడి - నిజ బంధులు సద్గురులే
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ `35

ప్రసవించి కాంచరుల్ - ప్రసాదింతురు మృతియు
ప్రసరించి కనుచూపు - గురుడిచ్చు నమృతము
కాంచరులను బంధమును – గరఁగించు బెన్నిద్ర
గతించిన పిదపనే - ఘనము గురుపద ముద్ర
కాంచరుల పక్షములుఁ - గక్షలును మనవి యౌ
గురుసేవకే వానిఁ - గూల్చుట అలవి యౌ
నమస్తే నమస్తే నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే నమస్ సద్గురుమూర్తే ‼ 36

కాంచరికిఁ జెప్పనిది - పంచవచ్చు నన్నకు
అన్నకును జెప్పనిది – అనుఁగు నేస్తములకు

నేస్తులకుఁ జెప్పనిది - నేరుగా నాలికిని
ఆలికిని జెప్పనిది - అఖిలాండ నాయకునకు
అఖిలాండ నేతతో - నననిది సద్గురునకు
అంతకన్న హితుఁడు లేఁ - డంత సన్నిహితుఁడును
నమస్తే నమస్తే నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే నమస్ సద్గురుమూర్తే ‼ 37

ఆయన తత్త్వ మర్థ - మైనచో నరులకు
భగవంతుని తత్త్వం - బర్థమైన యట్లే
ఆయన మాట సాక్షా - దఖిలేశు మాటయే
ఆయన చేత సాక్షా - దఖిలేశు చేతయే
తత్పదవాచ్యుని ప్రియ – తనయుఁడే సద్గురువు
తత్ కృపకై మ్రొక్కక - తప్పదు ప్రతి పశువు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 38

దర్శనీయంబైన - తన మర్త్యరూపమే
జన సాధారణము వలె - మనల భ్రమయించును
తప్పులను దిద్దికోఁ – దలఁపు పుట్టఁగనీక
తనదు వాత్సల్యమే - మనల నేమార్చును

కలనైన నొక పరియుఁ - గనరాక పోయిన
తరువాతనే తెలియు - సద్గురుని విలువయు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 39

ఇంతియై తా నింతుల - అంతరంగము గ్రహించుఁ
బురుషుఁడై పురుషులను - బుస్తకమట్లు పఠించుఁ
బశుపక్షి కీటముల - బాధలను గోడాడు
వారికై విరించితో – వాదించుఁ బోరాడు
సర్వాంతర్యామి సకల – సహృదయాంతరాత్ముఁడు
సద్గురుండు సమస్త –సత్త్వాంతరాత్ముఁడు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 40

భూత భావి భవంత - పూర్ణవేది సద్గురువు
ఆతని కగోచరం - బండాండంబున గఱువు
కికురించుట యనఁగా - సుకరము గాదాయనను
వేల్పులకును సద్గురువు - వెఱపును గొల్పేను
మన గూర్చి మన కన్న – మానుగాఁ దానెఱుఁగు
మనపై మన కన్నను - దన ప్రేమయే మెఱుఁగు

నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 41

తన నమ్మకము మిన్న - మనయందు మన కన్నఁ
దానిచ్చు విలువ భూరి - తనకిచ్చుదాని మీఱి
తనకు మనపై ధ్యానము – తన మీఁది కన్న ఘనము
మన సేవ తనకు వృథ - తన కృపయే మన కథ
నిజభక్త జీవితమే - నిజముగఁ దన చరితము
తన పూజ్యతయే సోఁకుఁ - దన భక్తులకు ఋతము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 42

వరగురుఁ డన్న మాట - వమ్ము కాదే నాట
వఱలు నది స్థిరమై - చిరమై శిలాక్షరమై ;
ఈనాడో తేపో - యెల్లుండియొ తెలియదు
తేడ లేక ధ్రువమై - తేలుటన్ననొ తప్పదు
సద్గురుని ప్రతి ముదల - సహశాస్త్రాధారము
సార రహితుల కదే - సదా విడ్డూరము
నమస్తే నమస్తే - మస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 43

ఒకసారి గురు మ్రోల - వంగెనేని శిరస్సు
వంశ పరంపరగా - వరియించు నాశీస్సు
శరణులనే వారికి - సంతతిగా నిచ్చును
బాహుదండములపై – బాధ్యతలు భరించును
తానే రుచి చూడని - తనుసుఖ సామ్రాజ్యము
నాశ్రితుల కర్మిలిన్ - హస్తగతము సేయును
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 44

లే దాయన కక్కఱ - లేనిది మన దగ్గఱ
లే దాయన వాకొన - రానిది మన ముందఱ
లే దాయన జోక్యము - కూడనిది బ్రదుకున
నిజమగు మేల్కోరువు - నిఖిలురకు సద్గురువు
చేపట్టిన యెడలఁ - జెనకెడి వారుండరు
చే విడిచిన యెడలఁ - జేసెడిదే యుండదు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 45

శాస్త్రమివ్వని బోధ - శాస్త్ర యిచ్చును గాద ?
దేవుఁడొసఁగని వరము – దేశికుండిడుఁ గరము

పరమేష్ఠి లిఖితమును - జెఱిపి వ్రాయును గురువు
ప్రకృతి శాసనములను - బ్రతిలిఖించును బోద్ధ
సంప్రదాయములను – సంస్కరించుచుఁ గ్రొత్త
ఆనవాయతులకున్ దా – నాద్యుఁడౌఁ బరవేత్త
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 46

గురుఁడు పలికిన మాట - గుండెలో హత్తును
అన్యులాడెడి మాట - లటే పరుగెత్తును
శిక్షకు నాదేశము - తత్ క్షణమె మఱుజన్మము
ఉండదు సిద్ధాంతము - ఉపపత్తియు శూన్యము
కాదు ఉపన్యాసము లేదు - అలంకారము
గురుని ప్రత్యుదితము ఘోర తపః ఫలితము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 47

"కో" యని పిలిచినచో – "ఓ" యని స్పందించును
వేల క్రోసులైనను – వేగఁ బాఱి వచ్చును
అంకితు లాగంతుకు - లనెడి భేదము లేదు
"అక్కఱ నున్నారా?" - అన్నదియె తన వాదు

నడుమను బర్వతాలు - నదులును సముద్రాలు
సరిహద్దులిత్యాది - తన కడ్డులు కావు
నమస్తే నమస్తే నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే నమస్ సద్గురుమూర్తే ‼ 48

తా నెప్పుడే రూపు - దాల్చి యేతెంచునో
కానవచ్చి పోయినఁ - గాని మనకుఁ దెలియదు
తా నెప్పుడే రీతిఁ - దగు బోధ సేయునో
అనుభవమైనఁ గాని - అవగతంబు గాదు
తా నెప్పుడెంత క - టాక్షింప నుండెనో
ఆ వృష్టిలో మునిగి - నపుడు గాని యెఱుగము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 49

తాఁకిన తత్ క్షణమే - తనకు బద్ధులఁ జేయు
భయభ్రాంతులు దీర్చి – అభయముఁ బ్రసాదించు
బాహ్యాంతర కల్మష - బృందమును బోకార్చు
లోకాంతర యానము - లోన మైమఱపించు
సమాధిస్థితి సులభ - సాధ్యంబు గావించు
సద్గురు కరపాద- స్పర్శ మన్నిటిని మించు

నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 50

గురు సమానులఁ జేయ - గురు నెంగిలియె చాలు
గురుని గట్టివేయఁగా - గురు పదాకృతి చాలు
గురు ప్రసాదమునకు - స్మరిత మృత్తిక చాలు
గురుని నిర్బంధింప - గుఱుబోనమే చాలు
అల్పసంతోషుఁడు - అంకిత జన కింకరుఁడు
శీఘ్ర ప్రసన్నుఁడు - సిద్ధుడైన సద్గురుఁడు
నమస్తే నమస్తే నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే నమస్ సద్గురుమూర్తే !! 51

కాదిలిన్ జెఱతురు - కౌటుంబులు మెల్లనఁ
గాదిలిన్ గురువు బాగు - కావించు నెల్లఱన్
గోపించి సంఘములు - కూలద్రోయు లెంబులన్
గ్రోధించి శోధించు - గురువు దోషంబులన్
అవసరార్థంబులే - ఐహిక శాసనములు
అపవర్గార్థములే - గురు నిర్దేశనములు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 52

మహిమ కాని మహిమది – మాట కాని మాటది
చూపు కాని చూపది - కాపు కాని కాపది
ఊహాతీతములు - ఉపదేశకు వ్యూహములు
అతఁడే యెఱిఁగిన దారు - లద్భుతానుగ్రహములు
అవశ్యము సేయఁబోఁ - డవసరము లేకున్న
అవసరమైన మానఁడు - అవని తలక్రిందైన
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 53

వా విప్పి చెప్పఁడు – వర శాస్త్రానీకము
కావించు విద్యలను - గరతలామకము
దరికిఁ బిలిచి తానొక – దమ్మిడివ్వకున్నను
అవకాశమిప్పించి – అందలమెక్కించును
మందులు గుప్పింపఁడు - మాన్పింపఁడు దినుసులు
మాట మాత్రముననే - మాయమొంటి నెరసులు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 54

మంత్రమేయఁడు వేఁప - మండలు ఝళిపింపఁడు
అక్షతలు సల్లఁడు – అంబువుఁ బ్రోక్షింపఁడు

సంకల్ప మాత్రమున - సకల దోషములను
బటాపంచలు సేసి - పటిమఁ జూపించును
ఎన్ని సేసినను దన - విన్నాణమనకుండ
"వెన్నుని మహిమ" యనును - దొణఁకని నిండు కుండ
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 55

తా సర్వసంగ పరి - త్యాగియై యున్నను
దైవాజ్ఞ వాటించి - జీవించు నాశ్రమిగ
మానావమానముల్ - మానినవాఁడయ్యును
శిష్య సమ్మానముల - స్వీకరించు నిర్మలిన్
నిరహంకారి అయ్యు - నిజభక్తుల మేలికే
తనను గొలుచుకొమ్మని - దయతోడ వాక్రుచ్చు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 56

సామ్రాజ్యమీఁజాలు - సామర్థ్యమున్నను
భిక్షాటనముతోనె - కుక్షి నింపికొనును
సశరీర ముక్తినే - సాధించికొన్నను
ప్రజాసంగ్రహమునకై - ప్రాణమును ధరించును

సర్వజ్ఞుఁడైనను - స్వంతంబుల నెత్తక
మందినే అడిగి వారి - మాటలాడించును
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 57

కనుచూపు మాత్రానఁ - గచ్చిక సేయఁగలిగి
శాంత హేమంత సర - స్సట్లు మిన్నకుండు
జ్ఞానార్ణవంబయ్యు - మౌనంబు వాటించి
వాద వివాద ప్రతి - వాదముఁ జేయకుండుఁ
బరమ పవిత్రుండయ్యుఁ - బాపాత్ములను గూడ
నిజ సన్నిధికి రా - నిచ్చేను గృపతోడ
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 58

అతిమానుష భూమిక - లందు విహరించుచు
నవతార కార్యతః - నరత్వమును నటించు
సకల నిర్జర వర్గ - సంపూజ్యుఁడయ్యును
భక్తులకుఁ గఱపఁగా - భజియించు దేవతల
ధర్మాధర్మములను - దాఁటిపోయి యున్నను
దట్టంపుఁ బట్టుదల - ధర్మమునే తొడరును

నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 59

ఆడకపోయినను మది - నభిలాషల నేర్చు
వేఁడినది వేఁడనిది - వేఁడుక నెఱవేర్చు
వేఁడకపోయిన నేది - వేగిరమో అదిచ్చు
నెప్పటికేది ప్రస్తుత - మప్పటికది తీర్చు
జలబుద్బుద సమమని - తెలిసియు గురుఁడొనర్చుఁ
బ్రాప్తకాలవేది - పరమ మానవతావాది
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 60

దయ లేదు సురలకు - దయ లేదు దనుజులకు
దయ లేదు శ్రుతులకు - దయ లేదు స్మృతులకు
దయ లేదు గ్రహములకు - దయ లేదు కర్మలకు
దయ్యమంటిదక్కటిక - దర్శనమీదెచ్చట
అఖిలంబుఁ దన యంతరాత్మగా వెలిఁగిన
మానవతామూర్తి యౌ - మహాత్మునిలో వినా
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 61

అపర పరమేశ్వరుం - డగు సద్గురు మూర్తిని
జిన్నఁబుచ్చె నేనియు - విన్నఁబోవఁ డాయన
సృష్టియే క్రుద్ధమై - దుష్టులపై లంఘించు
విప్లవించు ప్రకృతికి - విగ్రహములు స్తంభించుఁ
గ్రమ్మఱ నాయనయే - కల్పించికొను దనుక
ననుభవింపక తీఱదు - అంతరాత్ముని కినుక
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 62

అజ్ఞానిగ మనవచ్చు - నజ్ఞానులలోన
విజ్ఞానిగ మనవచ్చు - విజ్ఞానులలోన
అజ్ఞానుల మధ్యన - విజ్ఞానము నరకము
శాపము మహాలోపము - జన కోప కారకము
ప్రేమామృత మయుఁడౌ - ప్రబోధకుఁడు మాత్రము
ఈ మహీనరకమున - కియ్యకొనును జిత్రము !
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 63

ఉపదేష్ట కోపంబు - ఉల్కాపాతంబు
సుదూర ప్రకాశంబు - శూన్యప్రమాదంబు

ఆయన విమర్శనలు - ఆంతర్య దీవనలు
ఆయన సేయు దండన - అఖిల దోష ఖండన
ఆయన పూను మౌనము - అతితీవ్ర కర్మీణము
ఆయన సంతోషము - అతినిష్కల్మషము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 64

పురుడింపలే రెవఱు - గురుని చరితమును విని
పులకించి పరవశులై - పోవుటొకటి మినహా
అంచన వేయఁజాల - రాయన మహిమను దమ
కొంచె మవసరములకు - నించికొనుట మినహా
తన బోధలు తానే - యని గ్రహింప రెవఱును
విని చదివి బట్టిగా వల్లించుట మినహా
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 65

జగతి సద్గురు పేరు - స్మరియింపకున్నను
భగవంతుఁ డాయన - ప్రపంచమును మఱువఁడు
బ్రహ్మలోకము నుండియొ - బ్రధ్నలోకము నుండియొ
తనకుఁ దానో మఱి - దైవాజ్ఞ చేతనో

అవతరించును మగుడ - నవనీతలంబులో
భువన వాస్తవ్యులకు - భుక్తిముక్తుల నిచ్చికో
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 66

తన ముక్తి గొడవయే – తాఁ జూచికొనకుండఁ
దక్కిన జీవులకై - తపించునది సద్గురుండ
“తన శక్తితో నెవఱి - తాపమును దీర్తునా?”
అనుచుఁ దహతహలాడు - నాచార్యుఁడు లోన
మ్రొక్కువెట్టినఁ గాని - మొఱ వినరు నిర్జరులు
ఎదురేమియుఁ గోరక - హితమొనర్తురు గురులు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 67

“మది విప్పి చెప్పినను – బదులివ్వలే” దందురు
మంది తెలియరు - తమదు మాటున జఱుగు కబురు
ఎన్ని యొగ్గులను దా - మిన్నక తప్పించెనో
ఎన్నడును దనంతట - ఎన్నడుగా సద్గురువు
తెలిసిన మేళ్ళకే జను - లొలికింతురు నెనరులు
అర్మిలి గాకేమియు - నాశింపరు సద్గురులు

నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 68

కర్మఫల ధర్మసూక్ష్మ - నిర్మమత్వపు గోల
దీయఁడు సద్గురుండు - దీనులఁ బ్రోచు వేళ
మహిలో నార్తులను - మహిమతోఁ గాఁచుచుఁ
గడగండ్ల కడలిలోఁ — గాకిరెట్టనుకొనఁడు
వేసఁట పడఁడు మాట - వినక ద్రోహులగుడు
"వారి కర్మ" యను న - వ్యాజ కృపాపరుఁడు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 69

కావలసిన వారి - కపాలములలో దూరి
చేయవలసిన పనులు - సేయించుఁ బ్రతిసారి
అగపడఁ డెక్కడను - ఆకారముతోఁ దాను
అడిగికొనఁ డెవ్వటిని - ఆజ్ఞాపించఁ డొకటిని
అంతయుఁ దానంతట - అయినట్లనిపించు
ఆయన సంకల్పము - పోయిన అది నశించు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 70

తనవారు గారేనిఁ - దపము సేసిననైనఁ
జెంతకు రానివ్వఁడు సుంతైన సద్గురువు
తనవార్లైనచో - జనసంద్రానైనను
గుండు పిలకఁ బట్టి - గుంజికొనుఁ గృపాళువు
గోడ వలె రక్షించు - ఓడయై దాఁటించు
భవసాగరమునఁ దాను - భక్తులకై వసించు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 71

యథాశక్తి యథామతి - యెవఱు తన్నుఁ గొలిచిన
వృథా పోనీఁడు తా - నూరక యుపాసన
"యథావిధి యథోచితము — యథోక్త" మను వాదన
సలుపక అనుగ్రహించు - సంపూర్ణ విధమ్మున
బహూదారుఁడు గురువు - సహనైకాకారుఁడు
మనసునే తాఁ జూచు - మనసున్న మారాజు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ‼ 72

ప్రేమంబుననో మఱి - పెను ద్వేషంబుననో
అవసరార్థమో లేక - అలవోఁకలుగానో

బాధనో భీతినో - బుద్ధిజాడ్యమ్మననో
ఇచ్చుఁ దలఁచినఁ జాలు - ఇచ్చు నెనలేని మేలు
మాయాతీతుఁడు యోగ - మాయాధినాథుఁడు
అమాయక చక్రవర్తి - యట్టి సద్గురుమూర్తి
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 73

ఆయన దరహాసము - హరియించును త్రాసము
ఆయన యెదుటఁ బ్రభుత - లైనను దాసోఽహము
తన కర్పించిన ధనము - తప్పక శతగుణము
మనాదికి సద్గురుఁడే - మందుల దుకాణము
వికారముల కాయన - విరామ స్థానము
అఖండ చిత్తశాంతి కాయన నిధానము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 74

వేయి నోళ్ళాయనకు - విధము నెఱిఁగింపఁగా
వేయి కేళ్ళాయనకు - సాయము జఱిగింపఁగా
స్వస్వర మక్కఱలేదు - స్వయము రాఁ బనిలేదు
అఖిల లోకులు గురున - కనుఁగు మార్పనుపలే

సద్గురు మనమున కప - సవ్యముగా నెవ్వఱు
చేయవలె ననుకొన్నను - సాయము సేయఁగలరు ?
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 75

సృష్టి జేసినవాఁడె - సూచింపఁగాఁ జాలు
సూక్ష్మ సూక్ష్మముగఁ - దత్సూత్ర జాలములెల్లఁ
గఱచి పలికెడువారు - కఱవ వలసిన వారె
గురులు గాలేరు సద్ - గురువులును గాలేరు
సృష్టికర్త కభేది - సూక్ష్మ బోధకుఁ డట్టి
సద్గురు పదయుగళికి - సాష్టాంగ బహుళముల్
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 76

తోఁచిన త్రోవఁ బోవుమని - త్రోచువారే కాని
వెంటఁ గడకంటఁ దోడు - వెడలువారే లేరు
తలఁ బట్టని తత్త్వము - లొలుకఁబోయుదు రంతె
తగిన సాధన జెప్పి - తరియింపఁజేయరు
మఱుపుట్టుకన్ గూడ - మన కేలు విడువఁడు
మనకేది హితమదే - మప్పేను సద్గురుఁడు

నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 77

తన మహాసమాధికిఁ - దరువాత సహితంబు
సద్గురుండు బ్రోచును - ఛాత్రులను సతతంబు
నదృశ్యుఁడై వీరల - నడుపు ; మిక్కిలి కూర్చు-
వీరి తపో వ్రతములకు - విజయమును జేకూర్చు
శంకానుమితుల నా - టంకములఁ బోకార్చుఁ
దన యంతటులఁ జేసి - ధరణిలోన వెలార్చు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 78

సద్గురుఁడె కేవలము - సంతుష్టి చెందినను
సంతృప్తులయ్యెదరు - సకల బృందారకులు
హరుఁడె రోషించినను - గురుఁడు కాఁపాడును
గురుఁడె రోషింపఁగా - హరుఁడు వెనుకాడును
సద్గురు ననుగ్రహము - సడలిపోయిన నాట
విరసమే వినిపించు - వేల్పులందఱి నోట
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 79

బ్రదుకు వెట్టు వాతలు - భగవంతుని దూతలు
శ్రీగురు బడిలో మనలఁ - జేర్చిపోవు మాతలు
ఆచార్యు నాప్యాయ - మనుభవించిన కొలఁది
గోచరమగు భక్తుల - కది బడియు నొడియు నని
ఆయన నేర్పునది - మదికి హత్తుకు పోవునది
వేయి కల్పములకును వ్యర్థమై పోవనిది
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 80

మేలుగీడు లెఱిఁగిన - మేటి శ్రీగురులే
కల్యమనుకొన్నదటు - కాకపోవచ్చులే
సైఁపఁజాలరు జనులు - సమయాతీతము
ఓపిక మాలి చేతురు - వక్రపథ పాతము
శ్రీగురు నమ్మినచోఁ - జేఁజిక్కుట సులభము
తగు విధము తగు పథము - తనదు పరిష్కారము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 81

ఎవఱి ప్రతిభ పాటవము - వారి నణఁచి పెట్టునో
తమ తలఁపుల నెవ్వఱు - తము మినహాయింతురో

శాశ్వతీ క్షణికతలు - సమములగు నెవటికో
పాప నివృత్తులైన - పరితప్తు లెవ్వటో
ఎవటి గాలిపటము – చేఁజాటి పోవలేదో
వృకముల కర్పింపఁడు వారిని సద్గురుఁడు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ॥ 82

గుర్వనుగ్రహము సమ – కూడని దుస్సమయము
సర్వ పుస్తక చయము - సంగ్రహణాలయము
గ్రావాది దేవతలు - కతలు భావుకతలు
వైవిధ్యపుఁ దంతులు - వనచరముల గంతులు
గురుకృపా కటాక్షము - కురిసిన మఱుక్షణము
తానెంత సత్యమో - తత్త్వమంత తథ్యము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ॥ 83

సద్గురుఁడు తానుగా - సంకల్పింపకే
చెచ్చెరఁ దన దర్శనము - చేయఁజాలునదెవఱు ?
ఆయన ప్రేరణము – అబ్బక పూర్వమే
తన ప్రసాదమునకు – నోఁచుకొన్నదెవఱు ?

ఆయన అనుమతం - బమరక ముందరే
తనను స్తోత్రము సేయు - దక్షాత్ములెవ్వఱు ?
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ॥ 84

సద్గురుని కంటెను - క్షమాళువులము కాము
ధర్మదేశికుని కన్న - దయాళువులము కాము
బోధకునే మించిన - బుధవర్యులము కాము
మహాశాస్త్రను మీఱు - మహిమాన్వితులు కాము
మాటల ప్రోఁగుల మేము - మనోరోగుల మేము
మా యపరాధంబులను - మన్నింపు మక్కటిక
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ॥ 85

ఫలశ్రుతి

'**శతాయుర్వై పురుష**' ఇతి - శ్రుతి వచనములే
ఋతములౌ సద్గురు - స్తుతి మహిమ వశమ్ములై
ఒనఁగూడు విజయములు - ధనధాన్య కనకములు
వాస్తు వస్తు వాహనములు – వర పదారోహణములు
వ్యాజ్య ఋణ విమోచనము - వరుస రాజపూజ్యము

సర్వశాస్త్రవాంతము - సంపూర్ణారోగ్యము
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ॥ 86

కోరుకొన్న చదువులు - గురుస్తుతితో నొదవును
లభియించును గొలువులు - లంకెవడును మనువులు
సిద్ధించుఁ బదోన్నతులు - చిగురించును సంతతులు
దూరమైన ఆపులు - చేఱువెదురు హితులు
చెఱిగేను నిందనములు - చెఱసాల బంధనములు
పనిసేయు వైద్యమ్ములు - కనిపించును సొమ్ములు
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ॥ 87

స్మరింప గురుతత్త్వమును - స్వగురువు ప్రసన్నుఁడగును
గ్రహపీడలు తొలఁగును - గర్మఫలము లుడుగును
మనసు ప్రహ్లాదిల్లు - మఱుజన్మ రంజిల్లు
మహావాక్యార్థములు - మానుగా విశదిల్లు
జపధ్యాన సాధనలు - జయప్రదంబులగును
సజీవ సమకాలిక - సద్గురుఁడు లభించును

నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ॥ 88

కవికాలాదులు

మాసము పాటీ కృతి - మతిగోచరంబయ్యె
శ్రీ దుర్ముఖీ మార్గ - శీర్షమునఁ బూర్తయ్యె
సాయీశు కరుణా వ - శంబున నమూహ్యముగ
నందినవి వివిధ గురు - మందిర ప్రసాదములు
సాయి నృసింహ సర - స్వతి రాఘవేంద్రులు
వామనుఁడు వటపత్త్ర - ధాముఁడును దీవించిరి
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే ॥ 89

గుణ గరిష్ఠంబైన - గుంటూరు నగరమున
నావిర్భవించిన - హారీత గోత్రికుఁడు
వాచస్పతి బిరుదుఁడు - వైదేహీ దయితుఁడు
ఐదు పదుల ప్రాయము - నందుఁ గలిశకమున
నేనువేల నూఁట ప - దేఁడవ వత్సరమున
సద్గురు మననంబును - సమర్పించె సాయికి

నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 90

ఌ కృతి సమాప్తి ఌ

చిరంతనా ! సదాతనా ! చిన్నికేతనా !
భవబంధ నికృంతనా ! భువన భవ్య చింతనా !
గురుప్రేమ కేతనా ! గూఢాంగ ! సనాతనా !
అపనీత యాతనా ! అరాతి షట్క పాతనా !
అత్యంత పురాతనా ! అధ్యాత్మ చేతనా !
అఖిల దేశాతనా ! అవతార వినూతనా !
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! 91

ప్రతియుగావతారీ ! భగవచ్ఛరీరీ !
యవనాంబర ధారీ ! యమునా విహారీ !
సకల రాజసేవ్యా ! సంయమి జన నవ్యా !
సదా సంచిత భిక్షా ! సతత దాన దీక్షా !
అఖిల భువన పావనా ! ఆశ్రిత ప్రజావనా !

శివ హరి విధి భాసా ! షిరిడీ పుర నివాసా !
నమస్తే నమస్తే - నమస్తే ఉరుకీర్తే !
నమస్తే నమస్తే - నమస్ సద్గురుమూర్తే !! **92**

॥ హరిః ఓం తత్సత్ ॥



|| ఓం శ్రీ సద్గురు సాయినాథాయ నమః ||

|| ఓం శ్రీ దత్తాయ గురవే నమః ||

|| ఓం పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజాయ నమః ||

శ్రీ సద్గురు మననము

పద్యములకు లఘుటీక

శ్లో|| అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరమ్ |

తత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవే నమః ||

టీక :- యేన = ఎవటి చేత ; అఖండ = తెంపు లేని ; మండల + ఆకారమ్ = వృత్త రూపమైన ; చర + అచరమ్ = కదులునట్టివియు, కదలనట్టివియు నైన వానితో కూడుకొని ఉన్న ఈ విశ్వము ; వ్యాప్తమ్ = వ్యాపింపఁబడి ఉన్నదో ; యేన = ఎవటి చేత ; తత్ + పదమ్ = పరమాత్మ స్థానము ; దర్శితమ్ = చూపఁబడినదో ; తస్మై = ఆ ; శ్రీ గురవే = సద్గురువునకు ; నమః = నమస్కారము.

(ఈ పై ధ్యానశ్లోకము గురుగీత నుండి గ్రహింపఁబడినది)

1 వ పద్యము :– సింధురాననునకున్ = ఏనుఁగు తల కలిగినవానికి; ఆదిమ – సిద్ధ గురు వర్యునకున్ = తొలుదొల్త సిద్ధులైన గురువులలో మేటివాఁడైన ; శితికంఠునకున్

= శివునకు ; వేద + ఉపదేశకుఁడు = వేదమును బోధించు గురువైన ; విశాఖదేవునకున్ = శ్రీ సుబ్రహ్మణ్య (కుమార) స్వామికి ; గీతాగాయిత = భగవద్గీతను గానము చేసిన వాఁడు ; దయా క్షమా వార్ధి = దయాగుణమునకును, క్షమాగుణమునకును మేఱ లేని సముద్రము వంటివాఁడు ; స్ఫురణము + ఔ = ప్రేరణమైన ; ప్రకృతిరూప = ప్రకృతి మాత రూపమును ధరించిన ; వాణికిన్ = సరస్వతీదేవికి ; నమస్తే = నమస్కారము ; నమః (స్) = నమస్కారము ; ఉరుకీర్తే = గొప్ప కీర్తి గలవాఁడా ! ; సద్గురు మూర్తే = ఓ సద్గురుస్వామీ ! (ఈ సంబోధన ఎవటి ఇష్ట సద్గురువునకైనను వర్తించును).

2 వ పద్యము :– మధుచ్ఛందః + ముఖ్య = మధుచ్ఛందసుఁడు మొదలుగాఁ గల ; మహా మంత్ర దర్శులకున్ = గొప్ప మంత్రద్రష్టలకు ; మైత్రేయ + ఆది = మైత్రేయుఁడు మొదలుగాఁ గల ; వర = ఉత్తమమైన ; గృహ మహిషులకున్ = ఇల్లాండ్రకు.

3 వ పద్యము :– అభయ ప్రదాయికిన్ = అభయము నిచ్చువానికి ; మహా మహిత + ఆత్ముఁడు = గొప్ప మహనీయుఁడు ; మాణిక్య ప్రభునకు ; పావన = పవిత్రమైన ఇత్యాది = మొదలుగాఁ గల ; యుగ = ఈ యుగమునకు సంబంధించిన ; దత్త – సత్య + అవతారములకున్ = సత్యమైన మఱియు ప్రత్యక్షమైన దత్తావతారములకు.

4 వ పద్యము :– సార + అద్వైతి = అచ్చమైన అద్వైతి ; మహా మనీషి = గొప్ప మేధావి మఱియు గొప్ప మానవుఁడు ; ద్వైత మత ద్వీపి = ద్వైత మతముకు పులివంటి నాయకుఁడు ; సిద్ధ జన కేసరి = సిద్ధజనులలో సింహము వంటి రాజు ;

5 వ పద్యము :– శ్రీ శాక్య = శాక్యవంశములో జన్మించిన ; క్షమ + అవతారునకున్ = క్షమాగుణమే మానవ రూపములో అవతరించినట్లున్నవానికి ; సదా = ఎల్లప్పుడును

; నారాయణ + అంశుఁడు + ఔ = నర–నారాయణులను పేరు గల ఇద్దఱు సత్య యుగపు ఋషీశ్వరులలో నారాయణుని అవతారమైన ; నరేంద్రనాథునకున్ = శ్రీ వివేకానంద స్వామివారికి ; దక్షిణాగ్ని = దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని, ఆహవనీయాగ్ని అనునవి త్రేతాగ్నులు. రమణ మహర్షి వానిలో దక్షిణాగ్ని అంత పవిత్రుఁడు. ఇక్కడ 'దక్షిణాగ్ని' అనఁగా 'దక్షిణ దేశమునందు ప్రజ్వరిల్లిన ఆధ్యాత్మికాగ్ని' అని కూడ అర్థము.

6 వ పద్యము :– కాకుత్స్థ సేవి + ఔ = కకుత్ స్థుని వంశమునందు జన్మించిన శ్రీ రాముని సేవకుఁడైన ; పరమ భాగవతుఁడు + ఔ = మహాభక్తుడైన ; జందవెస్తా బోధి = జంద్ అవెస్తా అనునది పారశీక మతస్థుల ప్రాచీన పవిత్ర గ్రంథము. హిందువుల వేదమునకును, దానికిని మధ్య భాషలోను, భావములలోను మిక్కిలి పోలికలు గలవు. దానిని బోధించినవాఁడైన ; జరదుష్ట్ర సంయమికిన్ = జొరాస్టర్ అను మహర్షికి ; ఇతర హెబ్రీ ప్రవక్తలకున్ = తక్కిన యూదు ఋషులకు.

7 వ పద్యము :– (సుబోధము)

8 వ పద్యము :– వ్రాయికలు = ఉల్లేఖనములు (వేదములు, శాస్త్రములు, తత్త్వములు, కావ్యములు, వ్యాఖ్యానములు ఏవైనను కావచ్చును) ; శకటము — వాహనము (బండి) ; ప్రచోదనము = ప్రేరణము ;

9 వ పద్యము :– ఎల్లఱు = అందఱు ; వేఱు పేళ్ళ జలనిధులు — వేఱువేఱు పేరులు గలిగిన చిన్న చిన్న కడలులు ; వెరసి = సంఖ్య ; నాడులై = దేశములై.

10 వ పద్యము :– వటవృక్ష సన్నిభులు = మఱ్ఱిచెట్టు వంటి వారు ; వసుధన్ =

భూమిపై (లోకములో) ; ఆమిషము = మాంసము ; అగాధము = గొప్ప భేదము ; ఎట = ఎక్కడ ? మయాన = (మధ్యాన) మధ్యలో ఆత్మదర్శిత వినా? = ఆత్మదర్శ నము తప్ప? ; తన్నున్ = తనను ; వెల్లడించుకోన్ — వెల్లడించుకొనుటకు ; తెన్ను = దారి, దిక్కు ; ఈశునకున్ = భగవంతునకు ; కుమార నిర్విశేషము = కొడుకుతో సమానమైనది.

11 వ పద్యము :– శరణులు = భక్తుల యొక్క ; జన్మ రుజా జరా మరణములపై = పుట్టుక, రోగము, ముదిమి, చావులపై ; దొరతనము నెరపఁగల = అధికారము చెలాయింపఁగల ; ద్రుహిణుఁడే = బ్రహ్మదేవుఁడే ; విహ్వలురను = నిస్సహాయులను ; ప్రోవఁగాన్= కాపాడుటకు ; విసంఖ్య + అవతారములన్ = లెక్క (సంఖ్య) లేని అవతారములతో ; విశ్వమున వెలయునట్టి – విష్ణువే ; ఒసంగు = ఇచ్చునట్టి ; మృత్యుంజయుని = శివుని ; మర్త్య మూర్తియే = మానవ రూపమే.

12 వ పద్యము :– ప్రకృతికిన్ = మాయాశక్తికి ; స్వకృత = తన చేత నిర్మింపఁబడిన ; తనులు = తనువులు (శరీరములు) ; వినా = తప్ప ; పురుషునకున్ = పరమాత్మకు ; తనులు = తనువులు (శరీరములు) ; పుణ్యములు = పవిత్రములైనవి ; అనుస్వా రము = గుండు సున్న ; కనన్ = చూడఁగా (పరిశీలింపఁగా) ; నిఖిల జీవుల + ఎడన్ –= అన్ని జీవుల పట్లను ; చర + అచర వ్యాపులు — కదులునట్టివియు కదల నట్టివియు అయిన భూతముల యందు వ్యాపించినవారు ; మానవతారూపులు = మానవత్వమే రూపము దాల్చినవారు ; సహృదయ మేరువులు = మంచి మనసు గల వారిలో మేరు పర్వతము వంటివారు ;

13 వ పద్యము :– వరణీయులు = ఎన్నుకొనఁదగ్గవారు ; నేతలు = నాయకులు ;

గురుత వహించుటనే = గురుత్వమును పూనుట చేతనే (గురువులుగా వ్యవహరించుట చేతనే) ; మాతాపితలు = తల్లిదండ్రులు ; గోవత్సపు గంతులు = దూడల గంతులు ; స్నేహమునన్ = ప్రేమతో ; సృజనము = సృష్టి ; ప్రకృతిమాయి = ప్రకృతిమాత.

14 వ పద్యము :– స+ అంబరులు = బట్టలు వేసికొన్నవారు ; క్షౌమ పీత + అంబరులు = పసిమిపచ్చని పట్టుబట్టలవారు ; తుందిలులు = పెద్ద బొజ్జలు గలవారు ; అతిప్రాకృతులు = అత్యంత సామాన్యుల వలె కనిపించువారు ; మహా + అశుచులు – = బహు మురికివారు ; నాగరులు = నాగరికులు ; బర్బరులు = అనాగరికులు ; నానా + ఆడంబరులు = అనేక విధములైన వైభవములను అనుభవించువారు ; నర సామాన్యమునకున్ = మామూలు మనుష్యులకు

15 వ పద్యము :– కర్మఠులు = అతి తీవ్రమైన కర్మాచరణమునందు వ్యగ్రులగువారు ; నిర్మఠులు = ఉండుటకు మఠము మున్నగునవి లేనివారు ; కమఠులు = తాఁబేళ్ళ వలె సకలేంద్రియములను లోనకు ఉపసంహరించి బాహ్యస్పృహ గాని, బాహ్య ప్రపంచముతో సంబంధము గాని లేనివారు ; సుహఠులు = హఠయోగమును బాగుగా సాధన జేయువారు ; వనస్థులు = అడవులలో నివసించువారు ; భార్యాసహాయులు = భార్య తోడుగాఁ గలవారు ; దేవాలయ చారులు = గుళ్ళలోను, గోపురములలోను తిరుగాడు వారు ; దేశ + అధికారులు = దేశపాలకులు/నాయకులు ; అతిమానుష శక్తులు = మామూలు మానవులకు అలవి కాని గొప్ప మహిమలు గలవారు.

16 వ పద్యము :– దృశ్యులు = కళ్ళకు కనిపించువారు ; నిద్రా నిరీక్ష్యులు = నిద్ర పోయినపుడు కలలోఁ గాని, యోగనిద్రలోఁ గాని కనిపించువారు ; శఫరీ–మాంస + ఆదులు = చేఁపలను, మాంసమును తినువారు ; శాక–వాయు–ఖాదులు = కూర గాయలు భుజించువారు మఱియు గాలి భోంచేయువారు ; జడులు = కదలక మెదలక ఊరకుండువారు ; ముండులు = తలలు బోఁడి చేయించికొన్నవారు ; దీర్ఘ జటులు = పొడవుగా గడ్డములను, జుట్టును పెంచికొన్నవారు ; ఇలా పర్యటులు = ఒకచోట నిలవక ఎల్లప్పుడును భూమండలమున సంచరించువారు (ఇలా = భూమి) ; అధ్యాత్మ భాషులు = ఆధ్యాత్మిక విషయములపై ఉపన్యసించువారు ; అక్షర విన్యాసులు = అధ్యాత్మ విషయముల పై పుస్తకములు వ్రాయువారు ; సేవా సాధకులు = సమాజ/ లోక సేవను ఆధ్యాత్మిక సాధనగా ఆచరించువారు ; జీవ సమాధికులు = బ్రతికి ఉండఁగానే స్వచ్ఛందముగా కోరి సమాధి అయినవారు ; శత సహస్ర విధములు – లక్ష విధములు (శతము x సహస్రము = 100 x 1000) ; పథములు = త్రోవలు.

17 వ పద్యము :– అధఃకరించు = మించు ; సత్ + అసత్ + వివేకమును = మంచి, చెడు వేఱు చేసి చూడఁగల ప్రతిభను ; కలిగియున్ = కలిగి ఉండి కూడ ; ప్రేష్యులు గాన్ = సేవకులుగా ; స్వ శిష్యులను = తన శిష్యులను ; తనయ సత్తములు గాన్ = మంచి కుమారులుగా (తనయులు = కొడుకులు) ; మన్నించు = చూచికొను ; సద్గురువు ; మహిలోన్ = భూమిపై (ప్రపంచములో) ; కల్పతరువు = కోరిన కోర్కెలన్నింటిని తీర్చు దేవతల చెట్టు ; భగ వంతుఁడు + అయ్యును = తాను స్వయముగా దేవుఁడైనప్పటికిని ; మొగమోటమికిన్ = (వాడుక భాషలో) మొహమాటపు స్వభావమునకు ; ఇరవు= నిలయమైన వాఁడు.

18 వ పద్యము :– నిసుగున్ + పోలిన = పసిబిడ్డను పోలిన ; త్రికాల జ్ఞానియై = భూత, భవిష్య, వర్తమాన ఘటనలను గూర్చి తెలిసిన వాఁడై ; భవంతములోన్ = వర్త

మానములో ; సమాధి శాలి + ఐ = సమాధి దశ కలవాఁడై (అవధూతలు శరీరము చాలించుటను సమాధి అందురు. వారి విషయములో మరణ శబ్దమును వాడరాదు) ; సనాతనుఁడు = శాశ్వతముగా నుండువాఁడు.

19 వ పద్యము :- ఇష్టదైవ + ఆకృతిని = ఇష్టదైవము యొక్క రూపములో ; ప్రియ బాంధవ + ఆత్మ + ఐ = ప్రేమపాత్రులై దివంగతులైన చుట్టముల యొక్క ఆత్మల రూప ముగా తత్ + అన్యుండు = అంతకన్న వేఱైన వాఁడు ; నచ్చిక = ఇష్టము ; ఎచ్చటన్ = ఎక్కడ, ఎవటి యందు ; పండున్ = వృద్ధి చెందునో ; అదియె --= అదే, ఆ వ్యక్తులే, ఆ వ్యక్తుల రూపములోననే ; తాను + ఐ + ఉండున్ = తాను కనిపించును.

20 వ పద్యము ; పరాయణము = లక్ష్యము, గమ్యము, ధ్యేయము ; సత్ + మార్గ దర్శనము = మంచి త్రోవను చూపువాఁడు ; మానవతా స్పర్శము = విశాలమైన మానవతావాదపు వాసన.

21 వ పద్యము :- తుల లేని = సాటి లేని ; గురుని + అడుగు దోయికైన = గురువు గారి పాదముల జంట కోసమై చేసిన ; సంజీవని = పునరుజ్జీవింపఁజేయు మందు ; సుధయు = అమృతము ; సుదర్శన చక్రమును = ఆపదలను అడ్డుకొనుటలో విష్ణు చక్రము వంటిది ; సువర్ణ టంక నిధియు = బంగారు నాణెముల పాతర కూడ. గురు + ఉపచరణ + అనుకూలము = గురుని పాదములకు సేవ చేయుటకు అనువై నది ; నర వర్ష్మము = మానవ శరీరము ; కొఱ గాని = ఉపయోగము లేని.

22 వ పద్యము :- తన కన్నన్ = సద్గురువు కన్న ; ఎఱుఁగన్ + తగు = తెలిసికొనఁ దగిన ; సేవపై = సేవ కన్న ; తత్త్వమసి = వేదాంత విద్య ; ఘన తీర్థమును = గొప్ప

తీర్థ క్షేత్రము కూడ ; సనాతనమైన = ప్రాచీనమైన ; ఋక్కు = ఋగ్వేద మంత్రము ; సాయుజ్యము = మోక్షము.

23 వ పద్యము :- మేళనము + అయిరి = మిశ్రమైనారు, కలిసిపోయినారు ; ఒక చోన్ = ఒకే చోట (ఒకే శరీరములో) ; మేటి గురువుగా = సద్గురువుగా ; మూఁడు మూర్తులకున్ = బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులకు ; మూల మూర్తీభావము = తొలుత నున్న ఆది పరమాత్మ ; స + అంగ వేదము = ఆఱు అంగములతో కూడిన వేదము.

24వ పద్యము :- (సుబోధము)

25 వ పద్యము :- సన్నిధినే = సన్నిధిలోనే ; సంపన్నము= విజయవంతము ; సవ్యము = సరిగా జఱుగునట్టిది ; అపర కర్మలు = పితృకర్మలు ; సద్గురు నిష్ఠులైన = సద్గురునకు అంకితులైన ; సకల కర్ములు = అన్ని వృత్తుల వారును (ఏ వృత్తి చేసికొని బ్రదుకు వారైనను) ; శర్మలు = పవిత్ర బ్రాహ్మణులే.

26 వ పద్యము :- స్మరియించినందుకే = తలఁచికొన్నందుకే ; తనివోవున్ = తృప్తి చెందును ; సర్వ దోషము వోవున్ = అన్ని దోషములును పోవును ; స్వాదనీయంబు + అగును = రుచి చూడఁదగినది అగును ; భీషణమైన = నేర్చుకొనుటకు భయమును గొల్పునట్టి ; సరాళము = సుస్పష్టము, దారిలో అడ్డంకులు లేనిది ; పాషాణ పాకపుం = పాషాణము (arsenic) అను పదార్థము వలె విషప్రాయమై, అత్యంత కఠిన శైలి లో ఉన్న ; పటు గ్రంథరాశులే = జటిలమైన పుస్తకముల ప్రోఁగులే ; పఠనీయములు + అగును = సులభముగా చదువఁదగినవి అగును ; దినుసులై = పదార్థములై.

27 వ పద్యము :- వేల్పుల = దేవతల యొక్క ; ఒజ్జ దీవనకున్ - సద్గురుని ఆశీర్వా దము కొఱకు ; కాఁచెదరు + ఎదురు తెన్నులు = ఎదురు చూచెదరు ; నదీ పుష్కర

ములన్ = నదీ జలములలో ; క్రుంకెదరు = స్నానమాడెదరు ; అంఘ్రులకున్ = పాద ములకు ; ఆద్యుండు + అని = మొదటివాఁడు (మొదట బోధించినవాఁడు) అని.

28 వ పద్యము :– అష్ట విభూతులు = అణిమ మొదలైన అష్ట సిద్ధులకే విభూతులని పేరు. ఇవి యోగసాధన ద్వారా సిద్ధించును. శ్లో॥ అణిమా మహిమా చైన గరిమా లఘిమా తథా । ప్రాప్తిః ప్రాకామ్య మీశిత్వం వశిత్వం చాష్ట భూతయః ॥ ; అనుఁగు = ప్రియమైన ; వంశకరులు = కుమారులు ; నవ నిధులు = తొమ్మిది దివ్యనిధులు. వీని పేరులు– పద్మము, మహాపద్మము, శంఖము, మకరము, కచ్ఛపము, ముకుందము, కుందము, నీలము, వరము ; నమ్మిన కింకరులు = నమ్మిన బంటులు ; పంచ భూత ములు = భూమి, ఆపస్ (నీరు), తేజో (నిప్పు), వాయు (గాలి), ఆకాశములను ఐదు శక్తులు ; ఆయనకున్ + ఇంచు = ఆయనకు ప్రీతిని చేకూర్చు ; వశంవదులు = వశ వర్తులు ; ప్రతివేశ వసతులు = పొఱుగిళ్ళు.

29 వ పద్యము :– తనువును = శరీరమును ; లక్షింపఁడు = లెక్క చేయఁడు ; అప సము = (అప్పసము) ఎల్లప్పుడు ; తులువలన్ = చెడ్డవారిని ; శిక్షింపఁడు — ఈక్షిం పఁడు = చూడఁడు ; అలుసుగన్ = హీనముగా ; భాషింపఁడు = మాటలాడఁడు ; అనిష్టమున్ = ఇష్టము లేని దానిని/అశుభమును ; అధికులన్ = సమాజములోని ఉన్నత వర్గస్థులను ; భూషింపఁడు = సత్కరింపఁడు ; అరులను = శత్రువులను ; నిరంజనుఁడు + అయ్యున్ = ఏదియు అంటని వాఁడైనను ; నిఖిల మనః + రంజ నుఁడు = అందఱి మనస్సులను రంజింపఁజేయువాఁడు.

30 వ పద్యము :– తృణమును = గడ్డిపోఁచను కూడ. (శేషము సుబోధము).31 వ పద్యము :– వారించుచున్ = ముందే అడ్డుకొనుచు ; అందుండి = అందులో

నుండి; నేఱించును = నేర్పును, బోధించును ; మేల్పలుకు = సూక్తి, సుభాషితము, నీతి, సద్బోధ ; అబాధ + అనుభవములన్ = బాధలేని అనుభవముల ద్వారా ; హత్తిం చును గాక ! = హత్తికొనునట్లు తెలియఁజెప్పును గానీ.

32 వ పద్యము :– సందేశ హారకుఁడు = సందేశములను మోఁచువాఁడు ; వారధి = వంతెన ; వల్లభుఁడు = ప్రియుఁడు ; చాతుర్య దుర్లభుఁడు = తన చాతుర్యము మూల మున ఇతరులకు పట్టు చిక్కనివాఁడు.

33 వ పద్యము :– మన పొంటెన్ = మన కొఱకు ; అనఘుఁడే = పాప రహితుఁడే ; సురలకున్ = దేవతలకు ; అరయన్ + చాలిన = చూడఁగలిగిన ;

34 వ పద్యము :– వైనమున్ = విధానమును ; (శేషము సుబోధము).

35 వ పద్యము :– కాంచరి = కన్నవారిలో ఒకఱు Parent (తల్లి, లేక తండ్రి) ; ఎల్ల = అన్ని ; సీమల = ప్రాంతముల ; మందిన్ = ప్రజలను ; ఏలలేదు = పరిపాలింపఁ జాలదు ; దొరతనము = ప్రభుత్వము ; స్వజనంబులు = తనవారు ; సర్వదా = ఎల్ల ప్పుడు ; సముఖంబునన్ = ఎట్టెదుట ; ఱెప్పల + అట్లు = ఱెప్పల వలె ; భక్తుల దరిన్ = భక్తుల దగ్గర.

36 వ పద్యము :– కాంచరుల్ = తల్లిదండ్రులు ; మృతియు = చావును కూడ ; కాంచరులను బంధమును = తల్లిదండ్రులు అనెడి బంధమును ; పెన్నిద్ర (పెను + నిద్ర) = పెద్ద నిద్ర (మరణము) ; గతించిన పిదపనే = చనిపోయిన తరువాతనే (ఇక్కడ ఆత్మదర్శి అయిన సద్గురుని ప్రకరణము గనుక “సమాధి చెందిన వెనుకనే” అని చెప్పికొనవలె) ; ఘనము = శక్తిమంతము ; గురుపద ముద్ర = గురువుగారి

పాదముల ప్రభావము (మహిమ) ; పక్షములున్ = పక్షపాతములు (స్నేహములు) ; కక్ష లును = పగలును ; ఔన్ = అగును ; కూల్చుట = నాశనము చేయుట ; అలవి = సాధ్యము.

37 వ పద్యము :– నేస్తములకున్ = స్నేహితులకు ; ఆలికిని = భార్యకు ; అఖిలాండ నాయకునకున్= పరమాత్మకు ; అఖిలాండ నేతతోన్ = పరమాత్మతో .

38 వ పద్యము :– అఖిలేశు = భగవంతుని యొక్క ; తత్ + పద వాచ్యుని = వేదాంత మహావాక్యములలో ఎవఱినైతే తత్ అని వ్యవహరించెదరో ఆ పరమాత్మ యొక్క ; తత్ కృపకై = ఆయన దయ కొఱకు ; ప్రతి పశువు = ప్రతి జీవి. (వేదాంతమునందు మాన వులతో సహా అన్ని జీవులకును పశువులు అనియే పరిభాష)

39 వ పద్యము :– దర్శనీయంబైన = చూడ ముచ్చటైన ; మర్త్య రూపమే = మానవా కారమే ; బ్రమయించును = భ్రమపెట్టును ; దిద్దికోన్ = దిద్దికొనుటకు ; తనదు = తన యొక్క : ఏమార్చును = మాయపుచ్చును ; ఒక పరియున్ = ఒక్కసారి కూడ.

40 వ పద్యము :– ఇంతి +ఐ = స్త్రీగా మారి ; బాధలను = బాధలతో ; గోడాడున్ = వేదన చెందును ; విరించితో = బ్రహ్మదేవునితో ; సర్వ + అంతర్ + యామి = అన్నిటి యందు ఉన్నవాఁడు ; సకల సహృదయ + అంతర్ + ఆత్ముఁడు = మంచివారందఱి లోను ఉన్నవాఁడు ; సమస్త సత్త్వ + అంతర్ + ఆత్ముఁడు = అన్ని భూతముల యందు ఉన్నవాఁడు.

41 వ పద్యము :– భూత = గడిచిపోయిన కాలమును గూర్చియు ; భావి = రాఁబోవు కాలమును గూర్చియు ; భవంత = జఱుగుచున్న కాలమును గూర్చియు ; పూర్ణ వేది

= పూర్తిగా తెలిసినవాఁడు ; అగోచరంబు = కనిపించనిది ; అండాండంబునన్ = విశ్వము లోపల ; కఱవు = దుర్లభము ; కికురించుట = మోసపుచ్చుట ; సుకరము= సులువు, తేలిక ; వెఱపును గొల్పేను = భయమును కలిగించును ; మానుగాన్ = చక్కగా.

42 వ పద్యము :– భూరి = హెచ్చు ; మీఱి = మించి ; ఘనము = గొప్పది ; మన సేవ = మనము తనకు చేయు సేవ ; వృథ = లాభము లేనిది ; నిజభక్త జీవితమే = తన భక్తుల జీవితమే ; ఋతము = సత్యము.

43 వ పద్యము :– వరగురుఁడు = సద్గురుఁడు ; ఏనాటన్ = ఏ నాటికిని ; వఱలున్ = విరాజిల్లును ; శిలా + అక్షరమై = ఱాతి మీఁద వ్రాసిన లేఖనము వంటిదై ; ధ్రువమై = తథ్యమై ; తేలుట + అన్ననొ = నిరూపితమగుట మాత్రము ; చెఱి ముదల = ప్రతి ఆదేశమును ; సహ శాస్త్ర + ఆధారము = శాస్త్ర ప్రమాణములతో కూడికొన్నటు వం టిది ; సార రహితులకున్ = జ్ఞానము, పరిపక్వత లేని వారికి ; విద్దూరము = విచి త్రము.

44 వ పద్యము :– గురు మ్రోలన్ = గురువుగారి ఎదుట ; వంగెన్ + ఏనిన్ = వంగినచో ; శరణులనే = భక్తులనే ; తను సుఖ సామ్రాజ్యమున్ = భౌతిక సుఖముల వాహినిని ; ఆశ్రితులకున్ = భక్తులకు ; అర్మిలిన్ = ప్రేమతో.

45 వ పద్యము :– అక్కఱ లేనిది = అవసరము లేనిది ; వాకొన రానిది = మాటలాడ కూడనిది ; మేల్కోరువు = హితైషి ; నిఖిలురకున్ = అందఱికిని ; చేపట్టిన + ఎడలన్ = సద్గురువు యొక్క చేయి పట్టుకొన్నచో ; చెనకెడివారు = హాని చేయువారు/ ఎదు ర్కొనువారు ; చే విడిచిన + ఎడలన్ = సద్గురువు యొక్క చేతిని విడిచి పెట్టినచో.

46 వ పద్యము :– శాస్త = గురువు ; ఒసఁగని = ఇవ్వని ; దేశికుండు + ఇడున్ = గురువిచ్చును ; కరము = మిక్కిలి ; పరమేష్ఠి లిఖితమును = బ్రహ్మదేవుని వ్రాతను ; ప్రతిలిఖించును = తిరుగ వ్రాయును ; బోద్ధ = గురువు ; ఆనవాయతులకున్ = రీతి–రివాజులకు ; ఆద్యుఁడు + ఔన్ = మొదటివాఁడు (pioneer) అగును ; పరవేత్త = సద్గురువు.

47 వ పద్యము :– అన్యులు = ఇతరులు ; శిక్షకుని — సద్గురువు యొక్క ; ఉపపత్తియున్ = కార్యకారణ తర్కముతోఁ గూడిన నిరూపణము ; ప్రతి + ఉదితము = ప్రతి మాట.

48 వ పద్యము :– వేగన్ = వేగముగా ; పాఱి వచ్చును = పరుగెత్తి వచ్చును ; అంకితులు = అంకిత భక్తులు ; ఆగంతుకులు = క్రొత్తవారు ; అక్కఱ నున్నారా? = అవసరములో ఉన్నారా? లేదా? ; వాదు = ప్రశ్న ; నడుమను = మధ్యలో ; ఇత్యాది = మొదలైనవి.

49 వ పద్యము :– ఏతెంచునో = వచ్చునో ; కానవచ్చి పోయినన్ + కాని = ప్రత్యక్షముగా కనిపించి వెళ్ళితేనే గానీ ; అవగతంబు కాదు = అర్థము కాదు ; ఆ వృష్టి లోన్ = ఆ అనుగ్రహ వర్షములో. మునిగి – నపుడు గాని ఎఱుగము = తెలిసికొనలేము.

50 వ పద్యము :– తనకు బద్ధులన్ + చేయు = తనకు అంకిత భక్తులుగా చేసికొనును ; బాహ్య + అంతర = లోపలి మఱియు బయటి ; కల్మష బృందమును = మలినముల గుంపును ; పోకార్చున్ = పోఁగొట్టును ; లోకాంతర యానము లోనన్ = మఱియొక లోకమునకు ప్రయాణము చేయించి అందులో ; మై మఱపించున్ = ఈ లోకమును మఱచిపోవునట్లుగా చేయును ; సద్గురు కర పాద స్పర్శము = సద్గురువు యొక్క

కాల్సేతుల స్పర్శ.

51 వ పద్యము :– చేయన్ = చేయుటకు ; గురు పద + ఆకృతి = గురువుగారి పాదముల ముద్ర లేక శిల్పము ; స్మరిత మృత్తిక= గురువుగారి పేరుతో మంత్రించిన మట్టి ; నిర్బంధింపన్ = ఫలాని వరము కావలె ననుచు గురువుగారిని ఒత్తిడి చేయవలె నన్న ; కుఱు బోనమే = కొద్దిపాటి నైవేద్యమే ; అల్ప సంతోషుఁడు = అతి తక్కువతోనే సంతోషపడువాఁడు ; అంకిత జన కింకరుఁడు = తనకే అంకితమైన భక్తులకు సేవకుని వలె సేవ చేయువాఁడు ; శీఘ్ర ప్రసన్నుఁడు = త్వరగా ప్రసన్నుఁ డగువాఁడు.

52 వ పద్యము :– కాదిలిన్ = ప్రేమతో ; చెఱతురు = చెడఁగొట్టెదరు ; కౌటుంబులు = కుటుంబ సభ్యులు ; బాగు కావించున్ = బాగు చేయును ; ఎల్లఱన్ = అందఱిని ; లెంబులన్ = కుటుంబములను ; శోధించున్ = శుద్ధి చేయును ; అవసరార్థంబులే = అవసరములను తీర్చికొను నిమిత్తమే ; ఐహిక శాసనములు = లౌకిక చట్టములు ; అపవర్గ + అర్థములే = మోక్షము కొఱకైనవే ; గురు నిర్దేశనములు = గురువుగారి సూచనములు.

53 వ పద్యము :– కాపు కాని కాపు + అది = తానే స్వయముగా రక్షించినట్లు స్పష్టముగా పైకి వ్యక్తము కాని రక్షణమది ; ఉపదేశకు = గురువుగారి ; అవశ్యము = తప్పనిసరిగా ; అవని = భూమండలము.

54 వ పద్యము :– వా విప్పి = నోరు విప్పి ; చెప్పఁడు = బోధింపఁడు ; వర శాస్త్ర + అనీకమున్ = కోరుకున్న శాస్త్రముల సమూహమును ; కావించున్ = చేయును ; కర తల + అమలకము = అఱిచేతిలోని ఉసిరికాయ వలె ; దరికిన్ = దగ్గరకు ; దమ్మిడి= 60 ఏళ్ళనాడు చెలామణిలో ఉన్న ఒక తక్కువ మూల్యపు నాణెము ; అందలము =

పల్లకి ; గుప్పింపఁడు = పిడికిళ్ళతో విసరఁడు ; దినుసులు = ఆహార పదార్థములు ; మాయము = అదృశ్యము ; ఒంటి నెరసులు = శరీర దోషములు.

55 వ పద్యము :– అంబువున్ = నీళ్ళను (తీర్థ జలమును) ; ప్రోక్షింపఁడు = చల్లఁడు ; పటాపంచలు + చేసి = నాశనము చేసి ; పటిమన్ = శక్తిసామర్థ్యములను ; విన్నాణము = నేర్పు ; వెన్నుని = విష్ణువు యొక్క.

56 వ పద్యము :– ఆశ్రమిగన్ = ఆశ్రమమును కట్టికొని నివసించువాఁడుగా ; అయ్యును = అయినప్పటికిని ; శిష్య సమ్మానములన్ = తనకు శిష్యులు చేయు పూజలను ; నిరహంకారి = అహంకారము లేనివాఁడు ; మేలికే = మేలు కొఱకే ; కొలుచుకొమ్మని = పూజించికొనుమని ; వాక్రుచ్చున్ = చెప్పును.

57 వ పద్యము :– సామ్రాజ్యము + ఈన్ + చాలు = సమ్రాట్ పదవిని ఇవ్వఁగల ; కుక్షి = పొట్ట ; నింపికొనును ; సశరీర ముక్తినే = జీవన్ముక్తినే ; సాధించికొన్నను ప్రజా సంగ్రహమునకై – ప్రజాసేవకై ; సర్వజ్ఞుఁడు + ఐనను = అన్నియు తెలిసిన వాఁడైనను ; స్వంతంబులన్ + ఎత్తక = ఇతరుల స్వంత విషయములను నేరుగా వారితో ప్రస్తావింపకుండ ; మందినే = ప్రజలనే.

58 వ పద్యము :– కచ్చిక = మెత్తగా కరుళ్ళు కట్టిన చల్లని బూడిద ; శాంత హేమంత సరస్సు + అట్లు = నెమ్మదైన చలికాలపు కొలను వలె ; మిన్నకుండున్ = ఊరకుం డును ; జ్ఞాన + అర్ణవంబు + అయ్యున్ = జ్ఞానమునకు సముద్రము వంటి వాఁడయిన ప్పటికిని ; నిజ సన్నిధికిన్ = తన సమక్షమునకు.

59 వ పద్యము :– అతిమానుష భూమికలందున్ = మానవ లోక స్పృహకు అతీతము

లైన ఆధ్యాత్మిక స్థితులలో ; అవతార కార్యతః – తనకు భగవంతుఁ డప్పగించిన జన్మ కర్మలను నిర్వహించు నిమిత్తమే ; నరత్వమును నటించు = మానవుఁడైనట్లుగా అభిన యించును ; సకల నిర్జర వర్గ = అందఱు దేవతల సమూహమునకును ; సంపూజ్యుఁ డు + అయ్యును = పూజింపఁదగిన వాఁడైనప్పటికిని ; కఱపఁగాన్ = నేర్పుట కొఱకు; భజియించున్ = ఉపాసించును ; దట్టంపుం + పట్టుదలన్ = గట్టి అభినివేశముతో ; తొడరును = అనుసరించును, అవలంబించును.

60 వ పద్యము :– ఆడక పోయినను = పైకి మాటలాడక పోయినను ; మదిన్= భక్తుల మనసులలో ఉన్న ; అభిలాషలన్ = కోరికలను ; నేర్చున్ = తెలిసికొనును ; వేఁడుకన్ = సంతోషముతో ; వేఁడక పోయినన్ = వేఁడక పోయినను ; వేగిరమో = అత్యవసరమో ; జల బుద్బుద సమము = నీటి బుడగతో సమానము ; ఒనర్చున్ = (ఉపకారములు) చేయును ; ప్రాప్త కాల వేది = సమయము సమీపించినదని తెలిసికొనువాఁడు.

61 వ పద్యము :– సురలకున్ = దేవతలకు ; దనుజులకున్ = దనువు అనువాని సంతానమైన ఒకానొక రక్కసుల తెగకు ; శ్రుతులకున్ = ప్రభువు వలె ఆజ్ఞాపించు వేదములకు ; స్మృతులకున్ = మిత్రుని వలె సలహా ఇచ్చు ధర్మశాస్త్రములకు ; కర్మల కున్ = కర్మఫలములకు ; దయ్యము + అంటిది = పిశాచము వంటిది ; అక్కటిక = దయ ; దర్శనము + ఈదు + ఎచ్చటన్ = ఎక్కడను దర్శనమివ్వదు.

62 వ పద్యము :– అపర = సాక్షాత్తు ; చిన్నఁబుచ్చెన్ + ఏనియున్ = అవమానించి నను ; విన్నఁబోవఁడు = నిర్ఘాంతపోఁడు ; క్రుద్ధమై = కోపించినదై ; దుష్టుల పైన్ = అట్లు అవమానించిన చెడ్డవారి మీఁదకు ; లంఘించు = దుముకును ; విప్లవించు =

తిరగఁ బడిన ; ప్రకృతికిన్ = ప్రకృతిమాత మూలమున ; విగ్రహములు = ఆ దుష్టుల శరీరములు (శరీర ధర్మములు) ; స్తంభించున్ = పనిచేయక ఆఁగిపోవును ; క్రమ్మఱన్ = మఱల ; అనుభవింపక తీఱదు = అనుభవింపక తప్పదు ; కినుకన్ = కోప ఫలమును.

63 వ పద్యము :– మనవచ్చున్ = బ్రదుకవచ్చును ; జన కోప కారకము = ప్రజలకు కోపమును రప్పించునట్టిది ; ప్రబోధకుఁడు = సద్గురువు ; ఈ మహీ నరకమునకున్ = అజ్ఞాన కూపమైన ఈ భూలోకమనెడి నరకమున (మానవుల మధ్య) జీవించుటకు ; ఇయ్యకొనును = సమ్మతించును.

64 వ పద్యము :– ఉపదేష్ట కోపంబు = సద్గురుని కోపము ; ఉల్కాపాతంబు = ప్రకాశమానమైన ఉల్క పడుటతో సమానము ; సుదూర ప్రకాశంబు = మిక్కిలి దూరములో ప్రకాశించునట్టిది ; శూన్య ప్రమాదంబు = తన వలన ఆపద లేనట్టిది ; ఆంతర్య దీవనలు = లోలోపలి దీవనలు (ఇది వైరి సమాసము) ; అఖిల దోష ఖండన = అన్ని దోషములను కొట్టివేయునట్టిది ; అతి తీవ్ర కర్మీణము = అతి తీవ్రమైన కర్మ ఫలమునకు ఫలితమైనట్టిది ; అతి నిః + కల్మషము = మిక్కిలి సూటిదై, మనస్సున మఱియొక చెడు భావముతో కలుషితము కానట్టిది.

65 వ పద్యము :– పురుడింపలేరు = అనుకరింపలేరు ; గురుని చరితమును = సద్గురుని ప్రవర్తనమును ; కొంచెము + అవసరములను = అల్పమైన అవసరములను ; నించికొనుట = నింపికొనుట (తీర్చికొనుట) ; తన బోధలు తానే + అని = సద్గురుఁడు చేయు బోధలు ఆయన స్వంత అనుభవము నుండి జనించినవి అనియు, వానిని ఆచరించుటయే ఆయనకు నిజమైన భక్తి సేయుట అనియు ; బట్టిగాన్ =

భట్టీయముగా.

66 వ పద్యము :– జగతి = ప్రపంచము, లోకులు ; బ్రధ్నలోకము = సూర్యలోకము ; మగుడన్ – మఱల ; అవనీ తలంబులోన్ = భూతలమునందు ; భువన వాస్తవ్యులకున్ = భూలోక నివాసులకు ; భుక్తిముక్తులన్ = ఇహలోక జీవనోపాయములను మఱియు మోక్షమును ; ఇచ్చికోన్ = ఎవఱును అడగకుండ తనంతట తానే దయతోఇచ్చుట కొఱకు.

67 వ పద్యము :– సద్గురుండు + అ = సద్గురుఁడే ; తాపమున్ = ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక తాపములను ; ఒనర్తురు = ఒనర్చెదరు (చేసెదరు)

68 వ పద్యము :– అందురు = ప్రజలు పలుకుదురు ; మంది తెలియరు = ప్రజలు ఎఱుగరు ; తమదు మాటున = తమ వెనుక ; జఱుగు కబురు = సంభవించు వాస్తవ సమాచారమును ; ఎగ్గులను = అపకారములను, ప్రమాదములను ; మిన్నక = ఊరకే (అడగకుండనే), నిశ్శబ్దముగా ; ఎన్నదు గా = లెక్కపెట్టికొని చెప్పఁడుగా ; మేళ్ళకే = ఉపకారములకే ; నెనరులు = కృతజ్ఞతలు ; అర్మిలి = ప్రేమ.

69 వ పద్యము :– ఆర్తులను = కష్టములో ఉన్నవారిని ; కాఁచుచున్ = రక్షించుచు ; కడగండ్ల = ఇహలోకపు కష్టముల ; కడలిలోన్ = సముద్రములో ; కాకిరెట్ట + అనుకొనఁడు = (తాను చేయు సహాయము) కాకిరెట్ట వలె ఉపయోగము లేనిది అని అనుకొనఁడు ; వేసఁట పడఁడు = విసిగు చెందఁడు ; మాట వినక = తన మాట వినకుండ ; ద్రోహులు + అగుడు = తన వలన ఉపకారము పొందినవారు కృతఘ్నులు కాఁగా ; అవ్యాజ కృపాపరుఁడు = వ్యాజము (కారణము) లేకుండనే కృప జూపించువాఁడు.

70 వ పద్యము :– కపాలములలోన్ = (ఇక్కడ కపాలములనఁగా కేవల కపాలము లని కాదు. మనస్సులలో అని భావము). శేషము సుబోధము.

71 వ పద్యము :– కారు + ఏనిన్ = కాకపోయినచో ; తపము + చేసినన్ + ఐనన్ = తపస్సు చేసినను ; చెంతకున్ = దగ్గరకు ; సుంత + ఐనన్ = కొంచెమైనను ; జన సంద్రాన + ఐనను = జన సముద్రములో నైనను ; గుంజికొనున్ = లాఁగికొనును ;కృపాళువు = కృపాపరుఁడు ; భవ సాగరమునన్ = సంసార సముద్రమునందు ;

72 వ పద్యము :– యథాశక్తి = శక్తి మేఱకు ; యథామతి = మనస్సునకు తోచిన మేఱకు ; కొలిచినన్ = ఆరాధించినను ; యథావిధి = విధి విధాన ప్రకారము ; యథా + ఉచితము = సంప్రదాయానుసారము ; యథా + ఉక్తము = శాస్త్రోక్తము ; చలుపక = చేయక ; సహన + ఏక +ఆకారుఁడు = ఓర్పు మూర్తీభవించినవాఁడు.

73 వ పద్యము :– పెను = గొప్ప/ పెద్ద ; అలవోఁకలుగానో = ఊరకే గానీ, యాదృచ్ఛికముగా గానీ ; బాధనో భీతినో = బాధతో గానీ, భయముతో గానీ ; బుద్ధిజాడ్యముననో = బుద్ధిపొఱపాటున గానీ, అలవాటున గానీ ; ఇచ్చన్ = మనస్సులో ; ఎన లేని = సాటి లేని ; అట్టి = వంటి.

74 వ పద్యము :– దరహాసము = చిఱునగవు ; హరియించును = పోఁగొట్టును ; త్రాసమున్ = భయమును ; ప్రభుతలు = ప్రభువర్గము (లేక ప్రభుత్వము) ; శత గుణము = నూఱు రెట్లు ; మనాదికిన్ = మనోవ్యాధి (క్రుంగుబాటు – depres–sion) కి ; వికారములకున్ = మనో వికారములను ; విరామ స్థానము = పూర్తిగా అణఁగిపోవు చోటు ; అఖండ = తెంపు లేని, ఎడతెగని ; చిత్తశాంతికిన్ = మనశ్శాం

తికి ; నిధానము = నిధివంటివాఁడు.

75 వ పద్యము :– విధమున్ = వివిధ విషయముల ప్రకారమును ; ఎఱిఁగింపఁగాన్ = తెలుపుటకు/బోధించుటకు ; కేళ్ళు = చేతులు (కేలు = చేయి) ; స్వ + స్వరము = (బోధించుటకై) స్వంత గొంతు ; రాన్ + పని లేదు = రానక్కఱ లేదు ; అఖిల లోకులు = లోకులందఱును ; అనుఁగు = ప్రియమైన ; మార్పనుపలే (మాఱు + పనుపలే) = ప్రతినిధులే ; సద్గురు మనమునకున్ = సద్గురుని సంకల్పమునకు (మనము = మనస్సు) ; అపసవ్యముగాన్ = వ్యతిరేకముగా.

76 వ పద్యము :– సూక్ష్మ సూక్ష్మముగన్= మారుమూల వివరములతో సహా ; తత్+సూత్ర జాలములు + ఎల్లన్ = దానిని నిబంధించు సూత్రముల అల్లిక మొత్తమును ; కఱచి = నేర్చికొని ; పలికెడువారు = ఉపన్యసించువారు ; కఱవ వలసిన వారె = ఎప్పటికి ఇంకను నేర్వవలసినవారె ; సృష్టికర్తకున్ = పరమాత్మ నుండి ; అభేది = అభిన్నుఁ డు (భేదము లేనివాఁడు) ; సూక్ష్మ బోధకుఁడు = సద్గురువు ; పద యుగళికిన్ = పాదముల జంటకు ; సాష్టాంగ బహుళముల్ = పెక్కు సాఁగిలబాటులు.

77 వ పద్యము :– కడకంటన్ = చివరి వఱకు ; మఱుపుట్టుకన్ = మఱుజన్మలో ; కేలు = చేయి విడువఁడు ; మప్పేను = నేర్పును.

78 వ పద్యము :– మహాసమాధికిన్ = సద్గురువులు శరీర పరిత్యాగము చేయుటకు సమాధి అని పేరు ; సహితంబు = కూడ ; ప్రోచును = రక్షించును ; ఛాత్రులను = శిష్యులను ; సతతంబు = ఎల్లప్పుడు ; వీరలన్ = వీరిని (శిష్యులను) ; మిక్కిలి కూర్చు = తనకు మిక్కిలి ప్రియమగు ; శంకా + అనుమితులన్ = శంకలను మఱియు అను

మానములను ; పోకార్చున్ = పోఁగొట్టును ; తన + అంతటులన్ = తన అంతటి వారుగా ; ధరణి లోనన్ = లోకములో ; వెలార్చున్ = ప్రకాశింపఁ జేయును.

79 వ పద్యము :– సద్గురుఁడె కేవలము = కేవలము సద్గురుఁడే; బృందారకులు = దేవతలు ; హరుఁడె = శివుఁడే ; రోషించినను = కోపించినను ; సడలిపోయిన నాట = సడలిపోయిన దినమున ; విరసమే = నిరసన భావమే ; వేల్పులందఱి = దేవతలందఱి.

80 వ పద్యము :– బ్రదుకు + పెట్టు వాతలు = జీవితము పెట్టెడి వాతలు ; దూతలు = పనుపలు ; మాతలు = తల్లులు ; ఆచార్యు నాప్యాయము = ఆచార్యుని (సద్గురుని) ఆప్యాయతను ; గోచరము + అగున్ = స్పష్టము/అనుభవ సిద్ధము అగును ; వేయి కల్పములకును = కల్పమనఁగా 432 కోటుల సంవత్సరముల కాలవ్యవధి. అట్టి రెండు కల్పముల వ్యవధి బ్రహ్మదేవునకు ఒక అహోరాత్రము.

81 వ పద్యము :– మేలు + కీడులు + ఎఱిఁగిన = మంచిచెడ్డలను గూర్చి తెలిసిన ; మేటి = శ్రేష్ఠుఁడు ; కల్యము = శుభము, మంచిది ; అటు = అట్లు, ఆ విధముగా ' సైఁపన్ + చాలరు = ఓర్చికొనలేరు ; సమయ + అతీతమున్ = ఆలస్యమును ; మాలి = కోలుపోయి ; చేతురు = చేసెదరు ; వక్ర పథ పాతము = వంకర (తప్పుడు) త్రోవలలో పడుట.

82 వ పద్యము :– శాశ్వతీ క్షణికతలు = శాశ్వతత్వము మఱియు క్షణికత్వము ; పాప నివృత్తులు + ఐన = పాపము నుండి మఱలిన ; పరితప్తులు = పశ్చాత్తప్తులు ; వృకములకున్ = తోఁడేళ్ళకు ; అర్పింపఁడు = అప్పగింపఁడు.

ఈ (82 వ) పద్యపు ఆంతర్యము : – ఎవఱి ప్రతిభా పాటవములు అహంకారమునకు గాక, తమలోని భావోద్వేగములను మఱియు వాని దుష్పరిణామములను అణఁచిపెట్టు జాగరూక ప్రవర్తనమునకు దారి తీసినవో, ఎవఱు శాశ్వతత్వమున క్షణికత్వమును, అట్లే క్షణికత్వమున శాశ్వతత్వమును దర్శించినారో, ఎవఱు తమ తప్పులకు యథార్థముగా పశ్చాత్తాపము చెందినారో, ఎవఱి బాల్యకాలపు అమాయకత్వ వాసనలు పదిలముగా ఉన్నవో వారిని దుర్భర దుస్సహ వేదనలకు లోను కానీక సద్గురుఁడు ప్రేమతో కాఁచికొనును. (ఇక్కడ గాలిపటము బాల్యమునకు ప్రతీక).

83 వ పద్యము :– దు: + సమయము = చెడ్డ కాలము ; సర్వ పుస్తక చయము = అన్ని పుస్తకముల ప్రోఁగు/ కుప్ప ; సంగ్రహణాలయము = Museum ; గ్రావ + ఆది దేవతలు = గ్రావ అనఁగా ఱాయి. అట్టి పదార్థములతో చేయఁబడిన దేవతా మూర్తులను గూర్చిన భావనలు ; కతలు = పుక్కిటి పురాణములు ; భావుకతలు = ఊహాశక్తితో కల్పించిన కల్పనలు ; వైవిధ్యపుం + తంతులు = వివిధ కర్మకాండలు ; వనచరముల = కోఁతుల యొక్క ; తథ్యము = తప్పనిసరిగా ఉనికిలో ఉన్నటువంటిది.

84 వ పద్యము :– తానుగాన్ = స్వయముగా ; అభిలషింపకుండనే = కోరకయే ; చేయన్ + చాలునది = చేయఁగలుగునది వఱు ? చెచ్చెరన్ = వెంటనే ; అబ్బక = ప్రాప్తింపక ముందే ; అనుమతంబు = అనుమతి ; అమరక ముందరే = ఏర్పడక ముందే ; దక్ష + ఆత్ములు = సమర్థులు.

85 వ పద్యము :– అక్కటికన్ = దయతో. (శేషము సుబోధము).

86 వ పద్యము :– శతాయుర్వై పురుషః = మానవుఁడు నూఱేళ్ళ ఆయుర్దాయము గలవాఁడు ; ఇతి = అను ; శ్రుతి వచనములే= వేదవాక్కులే ; ఋతములు + ఔన్ =

వాస్తవములగును ; సద్గురు స్తుతి మహిమ వశములు + ఐ = సద్గురు స్తుతి మహిమకు లోఁబడివి అయి ; ధన ధాన్య కనకములు = డబ్బు, ధాన్యము, మఱియు బంగారము ; వాస్తు వస్తు వాహనములు = ఇళ్ళు, వస్తువులు మఱియు బండ్లు ; వర పద + ఆరోహ ణములు = శ్రేష్ఠమైన పదవులను అధిరోహించుటలు ; వ్యాజ్య ఋణ విమోచనము = న్యాయస్థానపు తగవుల నుండి, అప్పుల నుండి విముక్తి ; వరుస రాజపూజ్యము = ఎడ తెఱపి లేకుండ సమాజములో సమ్మానము ; సర్వ శాత్రవ + అంతము = అన్ని శత్రుత్వములును కడతేఱుట ;

87 వ పద్యము :– ఒదవును = ఒడఁగూడును ; కొలువులు = ఉద్యోగములు ; లంకె + పడును = ముడిపడును ; మనువులు = పెళ్ళిళ్ళు ; పద + ఉన్నతులు = పదవిలో పైకి ఎగబ్రాఁకుట (promotions) ; సంతతులు = సంతానములు

88 వ పద్యము :– ఉడుగును = జాఱిపోవును/ రాలిపోవును ; ప్రహ్లాదిల్లున్ = సుఖముగా శాంతిగా ఆనందముగా అనిపించును ; రంజిల్లు = ఆనంద మయమగును ; మహావాక్య + అర్థములు = తత్త్వమసి, అహం బ్రహ్మాస్మి మొదలైన గురూపదిష్టమైన వేదాంత వాక్యముల సారాంశము ; మానుగాన్ = చక్కగా ; విశదిల్లున్ = స్పష్టమగును/బోధపడును.

89 వ పద్యము :– ఈ కృతి — ఈ రచన ; మతి గోచరంబు + అయ్యెన్ = మనస్సునకు స్ఫురణమయ్యెను. (శేషము సుబోధము).

90 వ పద్యము :– గుణ గరిష్ఠంబు + ఐన = మంచి లక్షణములచే అత్యుత్తమమైన ; ఆవిర్భవించిన = పుట్టిన ; వాచస్పతి బిరుదుఁడు = వాచస్పతి అను లేఖినీ నామము గలవాఁడు ; వైదేహీ దయితుఁడు = శ్రీమతి వెంకట పద్మజా వైదేహికి భర్త ; ప్రాయ

మునందున్ = వయస్సులో ; కలిశకమునన్ + ఏనువేల నూఁట పదేఁడవ వత్సరమునన్ = కలిశక ప్రకారము 5117 వ సంవత్సరమున (క్రీస్తు శకము 2017).

91 వ పద్యము :– చిరంతనా ! = చాల కాలము పాటు అవతారము ధరించి ఉన్నవాఁడా ! ; సదాతనా ! = ఎప్పటికిని ఉండువాఁడా ! ; చిత్ + నికేతనా = బ్రహ్మచైతన్యమునందు నెలకొన్నవాఁడా ! ; భవ బంధ నికృంతనా = జనన మరణ పాశములను తెగఁగొట్టు వాఁడా ! ; భువన భవ్య చింతనా = లోకమునకు మేలు చేయవలెనని ఆలోచించువాఁడా ! ; గురుప్రేమ కేతనా = గురువుగారి పట్ల ప్రేమకు పతాకమువంటి వాఁడా! ; గూఢాంగ = రహస్యమైన అవతారము/ వేషము గలవాఁడా ! ; సనాతనా = శ్రోత్రియుఁడా ! ; అపనీత యాతనా = భక్తుల యాతనలను పోఁగొట్టువాఁడా ! ; అరాతి షట్క పాతనా = కామక్రోధాదికములైన ఆఱు శత్రువులను పడఁగొట్టు వాఁడా ! ; అత్యంత పురాతనా = మిక్కిలి ప్రాత పురాణ పురుషుఁడా ! ; అధ్యాత్మ చేతనా ! = ఆత్మికమైన చేతన గలవాఁడా ! అఖిల దేశాతనా = అన్ని దేశములందును సంచరించు వాఁడా ! ; అవతార వినూతనా = అవతారముచే విలక్షణమైన వాఁడా ! (నూతనమైన /అపూర్వమైన అవతారమును దాల్చిన వాఁడా !)

92 వ పద్యము :– ప్రతి యుగ + అవతారీ = యుగ యుగమునకు అవతరించు వాఁడా ! భగవత్ + శరీరీ = భగవంతుఁడే ఆకృతి దాల్చినవాఁడా ! ; యవన వేషధారీ = మహ్మదీయుని వస్త్రధారణ గల వాఁడా ! ; యమునా విహారీ = యమునా నదిలో విహరించిన శ్రీకృష్ణుఁడా ! ; సకల రాజసేవ్యా = అందఱు ప్రభుత్వాధినేతల చేతను సేవింపఁబడువాఁడా ! ; సంయమి జన నవ్యా = సాధు సత్పురుషుల చేత పొగడఁదగినవాఁడా ! ; సదా సంచిత భిక్షా = ఎల్లప్పుడును భిక్షాన్నమునే ప్రోఁగు చేసికొన్న వాఁడా ! ; సతత దాన దీక్షా = ఎల్లప్పుడు దానము చేయు వ్రతము గలవాఁడా ! ;

అఖిల భువన పావనా = అన్ని లోకములను పవిత్రము చేయువాఁడా ! ; ఆశ్రిత ప్రజా + అవనా = ఆశ్రయించిన భక్త జనులను కాఁపాడువాఁడా ! శివ హరి విధి భాసా = శివుఁడుగా, విష్ణువుగా, బ్రహ్మగా దర్శన మిచ్చువాఁడా ! షిరిడీ పుర నివాసా = షిరిడీ పురమునందు నివసించువాఁడా ! హే శ్రీ సాయినాథా ! నమస్తే నమస్తే నమస్తే నమః॥

॥ హరిః ఓం తత్సత్ ॥

